## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం
ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:361 | బుధవారం సెప్టెంబర్ 09, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


# అసెంబ్లీ దగ్గర జరిగింది కాకతాళీయం కాదు..

## ఫామ్ హౌస్‌లో చేసిన కుట్ర: భట్టి

- ఫామ్‌హౌస్‌లోనే అసెంబ్లీ కుట్రకు బీజాలు పడ్డాయన్న భట్టి
- స్పీకర్‌ను అవమానించడం రాజ్యాంగాన్ని ధిక్కరించడమే
- బీఆర్ఎస్ నేతల తీరుపై డిప్యూటీ సీఎం తీవ్ర ఆగ్రహం
- స్పీకర్ పదవి అత్యున్నత రాజ్యాంగబద్ధమైనదని వ్యాఖ్య
- బీఆర్ఎస్ పాత భూస్వామ్య భావజాలాన్ని వీడలేదని విమర్శ
- ఇద్దరు ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- సభలో తీర్మానం చేసి మండలికి పంపినట్లు వెల్లడి

2లో



## ఉత్తరాంధ్రలో వైకాపాకు బిగ్‌షాక్.. తెదేపాలో చేరిన బొత్స మేనల్లుడు



2లో

విజయనగరం: స్థానిక ఎన్నికల ముందు ఉత్తరాంధ్రలో వైకాపా కు బిగ్ షాక్ తగిలింది. మాజీ మంత్రి, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైకాపా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆ పార్టీకి రాజీనామా చేసిన తెదేపాలో చేరారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను వైకాపా అధ్యక్షుడు జగన్‌కు పంపారు.

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు



హైదరాబాద్: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్.. సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది.

2లో

# స్థానిక ఎన్నికలు..

## అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేయాలి: సీఎం చంద్రబాబు

- స్థానిక ఎన్నికల్లో అత్యుత్తమ అభ్యర్థుల ఎంపిక
- గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చంద్రబాబు సూచన
- కూటమిలో సమన్వయం, బ్యాలెన్సింగ్ పాటించాలని ఆదేశం
- అభ్యర్థుల ఎంపికను కమిటీలతో పర్యవేక్షించాలని సూచన



2లో


**CHINTALAPUDI NAGARA PANCHAYAT, CHINTALAPUDI**


**e-PROCUREMENT TENDER NOTICE No: 46-47/DMF/2026-2027, DATED.08.09.2026.**

The Commissioner, Chintalapudi Nagarapanchyat invites tenders from interested, eligible bidders for **"Construction of Strom water Drain at Various Palces in chintlapudi Nagara panchyat"** Total No. of works is 2 with an amount of **Rs.58.62** Lakhs.

Tender schedules are available on e-procurement market place from **09.09.2026. Last date of receipt of tenders is 15.09.2026.** Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Chintalapudi Nagara Panchyat, Eluru District (Phone / Fax: 08823-222280).

**Sd/- Commissioner,**
**Chintalapudi Nagar Panchayat**










# స్థానిక ఎన్నికలు..

## అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేయాలి: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయి సమన్వయం వరకు ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలని తెదేపా (ఐఖా) అధినేత, సీఎం చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. అమరావతిలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో స్థానిక ఎన్నికల సన్నాహాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. గెలుపే లక్ష్యంగా పనిచేస్తూనే కూటమిలో బ్యాలెన్సింగ్ పాటించాలని సూచించారు.

సీట్లు, రిజర్వేషన్లపై కొందరు కోర్టులకు వెళ్లినా.. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్లు, ఛైర్మన్లను ఎన్నుకునేలా నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా.. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆదేశించారు. కమిటీల ద్వారా అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాగద్వేషాలకు అతీతంగా క్షేత్రస్థాయిలో నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. వైకాపా దుష్ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని చంద్రబాబు స్పష్టం చేశారు. వైకాపా ఫేక్ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టి ఓటు బ్యాంక్‌ను మరింత బలోపేతం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఓటు వేయని వారినీ చేసిన అభివృద్ధితో ఆకట్టుకుని పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

మొదటిపేజీ తరువాయి

అంతకుముందు శాసనసభ కూడా తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. మంత్రి దామోదర రాజనర్సింహ ఈ మేరకు సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. "స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోంది. సభామర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోంది. మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోంది. బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలి. శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి. నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి" అని శాసనసభ తీర్మానించింది.

# ఉత్తరాంధ్రలో వైకాపాకు బిగ్‌షాక్..
# తెదేపాలో చేరిన బొత్స మేనల్లుడు

మొదటిపేజీ తరువాయి

విజయనగరం జడ్పీ ఛైర్మన్, భీమిలి వైకాపా ఇన్‌ఛార్జ్‌గానూ చిన్న శ్రీను పనిచేస్తున్నారు. వైకాపా సభ్యత్వంతో పాటు విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి ఇన్‌ఛార్జ్ పదవికీ ఆయన రాజీనామా చేశారు.

కొన్నాళ్లుగా బొత్స సత్యనారాయణ, చిన్న శ్రీను మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. పార్టీలో మేనల్లుడి ప్రాధాన్యం తగ్గించేలా బొత్స ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను వైకాపాకు రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.

సీఎం చంద్రబాబు సమక్షంలో తెదేపాలోకి..

వైకాపాకు రాజీనామా చేసిన అనంతరం చిన్న శ్రీను తెదేపాలో చేరారు. ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు (జప్పుఅఎతీఖుఏఎబ) సమక్షంలో అనుచరులతో కలిసి పసుపు కండువా కప్పుకొన్నారు. శ్రీను కుమార్తె సిరి సహస్ర, ఆమె అనుచరులు కూడా తెదేపాలో చేరారు. పార్టీలో చిన్న శ్రీను చేరిక కార్యక్రమానికి మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కళా వెంకట్రావు, కొండ్రు మురళి, కోళ్ల లలితకుమారి తదితరులు హాజరయ్యారు.

# అసెంబ్లీ దగ్గర జరిగింది కాకతాళీయం కాదు..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్:



శాసనసభ వేదికగా ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరుపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న ఘటన కేవలం కాకతాళీయం కాదని, అది బీఆర్ఎస్ ఫామ్‌హౌస్‌లో వ్యూహాత్మకంగా పన్నిన పెద్ద కుట్ర అని ఆయన ఆరోపించారు.

### సభనూ, రాజ్యాంగాన్ని అవమానించడమే

శాసనసభ స్పీకర్ స్థానం ఒక అత్యున్నత రాజ్యాంగబద్ధమైన పదవి అని, ఆ స్థానంలో ఉన్న వ్యక్తిని అవమానించడం అంటే ఒక్క వ్యక్తిని మాత్రమే కాకుండా మొత్తం శాసనసభను, రాజ్యాంగ వ్యవస్థలను అవమానించడమేనని భట్టి స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు అసెంబ్లీ ప్రాంగణంలో ప్రవర్తించిన తీరు అత్యంత జుగుప్సాకరంగా ఉందని మండిపడ్డారు.

### భూస్వామ్య భావజాలం నుంచి బయటకు రాలేదు

బిఆర్ఎస్ నాయకులు నేటికీ తమ పాత భూస్వామ్య, దొరల భావజాలాన్ని వీడలేదని డిప్యూటీ సీఎం విమర్శించారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్ స్థానంలో ఉండటాన్ని సహించలేకనే ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు, నిరసనలకు దిగుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య బద్ధంగా పనిచేస్తున్న సభను అడ్డుకోవడం, స్పీకర్ గౌరవానికి భంగం కలిగించడం ద్వారా రాష్ట్రాన్ని అశాంతి వైపు నెట్టాలని చూస్తున్నారని తెలిపారు.

### కఠిన చర్యలు తప్పవు

రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవికి భంగం కలిగించేలా ప్రవర్తించిన సదరు ఇద్దరు ఎమ్మెల్సీలపై చట్టపరంగా, సభా నియమాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఈ అంశంపై పూర్తి ఆధారాలతో మండలికి (కౌన్సిల్) పంపి తగిన చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని భట్టి విక్రమార్క వెల్లడించారు.

# కేటీఆర్, హరీశ్‌రావు విడుదల

సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. రేవంత్ చేసే దమనకాండను రాష్ట్ర ప్రజలంగా గమనిస్తున్నారన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో హెడ్ లైన్స్ మారుతాయి కానీ ప్రజల జీవితాలు మారవని చెప్పారు. హరీష్ రావు మాట్లాడుతూ.."తెలంగాణలో క్రాప్ హాలిడే ప్రకటించారు. యూరియా యాప్‌లు పెట్టి రైతుల ఉసురు పోసుకుంటున్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు ధర్నా చేస్తున్నారు. ఉద్యోగుల ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదు. నయాపైసా ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వడం లేదు. సబితక్క గొంతు మీద మగ పోలీసు చేయి వేసి నొక్కారు అసెంబ్లీ గౌరవ సభను రేవంత్ కౌరవసభగా మార్చారు." అన్నారు. కాగా ఈ రోజు రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

**ఏం జరిగింది?**

కేసీఆర్ ఇంటి ముట్టడికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన పిలుపుతో యాదాద్రిలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కేసీఆర్ ఇంటిని ముట్టడించేందుకు వెళుతున్న కాంగ్రెస్ నేతల్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. కేసీఆర్ ఎర్రవెల్లి నివాసం ముట్టడికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెళ్తున్నారనే సమాచారంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అప్రమత్తమయ్యారు. అసెంబ్లీ నుంచి ఎర్రవల్లికి బయల్దేరారు.

ఈ క్రమంలో కేసీఆర్‌కు మద్దతుగా వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బొల్లారం వద్ద భారీ ఎత్తున మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. బొల్లారం చౌరస్తా నుండి ఎరవెల్లి వైపు రోడ్డుపై కేటీఆర్ హరీష్ రావు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నడుచుకుంటూ వెళ్లారు. హకీంపేట్ దాటిన తర్వాత కేటీఆర్, హరీష్ రావుతో పాటు ఇతర పార్టీ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేటీఆర్‌ని బోయన్ పల్లి, హరీష్ రావును జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ తరలించారు. కాసేపటి క్రితమే వారిద్దరిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో వారిద్దరు మీడియా ఎదుట మాట్లాడారు.

# తెలంగాణ పోలీస్ శాఖలో బదిలీలు.. కొత్త పోస్టింగ్‌లు

3. ఎస్‌కే అబ్దుల్ రహ్మాన్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు జయశంకర్ భూపాలపల్లి డీసీఆర్‌బీ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.
4. ఏ. రవికుమార్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను జగిత్యాల డీసీఆర్‌బీ డీఎస్పీగా నియమించారు.
5. బి. నందిరామ్ నాయక్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలోని డీజీ కంట్రోల్ రూమ్ డీఎస్పీగా బాధ్యతలు అప్పగించారు.
6. బి. సోమ్నారాయణ్ సింగ్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ) డీఎస్పీగా నియమించారు.
7. జె. వెంకటేశ్వర్‌రావు -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు మెదక్ డీసీఆర్‌బీ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.
8. బి. కిషన్‌కుమార్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను హైదరాబాద్ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసీపీగా నియమించారు.
9. ఎల్. రమేష్‌కుమార్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు హైదరాబాద్ సిటీ సీటీసీ ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారు.
10. ఎన్. శ్రీనివాస్‌రెడ్డి -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను సంగారెడ్డి డీసీఆర్‌బీ డీఎస్పీగా నియమించారు.
11. కాదేరు వెంకట్‌రెడ్డి -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ) డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.
12. కొమల్ల సుబ్బరామిరెడ్డి -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను హైదరాబాద్ సిటీ సీసీఎస్ అండ్ డీడీ ఏసీపీగా నియమించారు.
13. ఎస్. సుదర్శన్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు హైదరాబాద్ సిటీ సీసీఎస్ అండ్ డీడీ ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారు.
14. ఎన్. శంకర్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను హైదరాబాద్ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసీపీగా నియమించారు.
15. పి. విజయ్‌కుమార్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు వెస్ట్‌జోన్ రోడ్ సేఫ్టీ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.
16. కె. భాస్కర్ -- ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయనను బదిలీ చేసి తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ) డీఎస్పీగా నియమించారు.
17. ఎం. వెంకట నర్సయ్య -- ప్రస్తుతం ఆదిలాబాద్ డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయనను బదిలీ చేసి సీఐడీ డీఎస్పీగా నియమించారు.

# మోదీ హాజరయ్యే సదస్సు.. PMO ఫేక్ ఐడీ, తుపాకీ కలకలం!

ముంబయిలో ప్రధాని మోదీ పాల్గొనాల్సిన ఓ కార్యక్రమంలో భద్రతా సమస్య ఎదురైంది. కొన్ని గంటల ముందే సభా ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. అనుమానితుడి వద్ద ప్రధానమంత్రి కార్యాలయం పేరుతో ఫేక్ ఐడీ కార్డు, అతడి బాడీగార్డ్‌గా పేర్కొన్న మరో వ్యక్తి వద్ద తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. విషయం తీవ్రత దృష్ట్యా.. ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈ కేసు దర్యాప్తు బాధ్యతను చేపట్టారు. ప్రస్తుతం ఆ ఇద్దరినీ విచారిస్తున్నారు.



ముంబయిలోని బాంద్రా- కుర్లా కాంప్లెక్స్‌లోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ కార్యక్రమం జరగనుంది. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును ప్రధాని మోదీ మంగళవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో వేదిక సమీపంలో తనిఖీలు చేస్తున్న పోలీసులకు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ప్రశ్నించగా.. రోహన్ పరేఖ్ (24) అనే వ్యక్తి వద్ద ప్రధానమంత్రి కార్యాలయం పేరుతో ఫేక్ ఐడీ కార్డు, అతడి గన్‌మెన్ వద్ద తుపాకీ లభించింది. అప్రమత్తమైన అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని వారిద్దర్నీ అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థుల కోసం 5 లక్షల సిమ్‌కార్డులు

విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైని అన్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు అనుగుణంగా వారంతా నైపుణ్యాలు నేర్చుకోవాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం 5లక్షల సిమ్ కార్డుల కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఈ మేరకు ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ-లెర్నింగ్‌లో భాగంగా ఈ ఏడాది 10



నుంచి 12 తరగతి చదివే విద్యార్థుల్లో 5లక్షల మందికి ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వీటికి ఇంటర్నెట్ సదుపాయం కల్పించేందుకు సిమ్ కార్డులు కొనుగోలు చేయాలని తాజాగా నిర్ణయించింది. తద్వారా విద్యార్థులు ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్‌తోపాటు ఇతర విద్యా సంబంధిత సోర్సుల నుంచి కొత్త నైపుణ్యాలను నేర్చుకునే వీలుంటుందని హరియాణా ప్రభుత్వం భావిస్తోంది.

# మైనర్ బాలికపై అత్యాచారం.. నిందితుడికి మరణశిక్ష

తమిళనాడులోని తిరునెల్వేలిలో ఓ మైనర్ బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నాలుగేళ్ల క్రితం జరిగిన ఈ ఘటన లో ఒక నిందితుడికి న్యాయస్థానం మరణశిక్ష విధించింది. మరో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. తిరునెల్వేలికి చెందిన 16 ఏళ్ల బాధితురాలికి 2022లో పెయింటర్‌గా పనిచేసే మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. రెండు వారాల పాటు వీరిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ



బాలికను అతడు మీనాక్షిపురంలోని తన బంధువుల ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ తన స్నేహితులు చిన్నకుట్టి, మురుగేశన్‌తో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు.

**గర్భస్రావం వికటించి బాలిక మృతి**

ఈ విషయాన్ని బాధితురాలు తన కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో (ఉాజూా) చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై విచారణ జరిపిన ప్రత్యేక న్యాయస్థానం.. మంగళవారం తీర్పు వెలువరించింది. గతంలో తీవ్ర నేర చరిత్ర ఉన్న చిన్నకుట్టికి మరణశిక్ష విధించిన కోర్టు.. మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్లు చొప్పున జైలు శిక్ష విధించింది.

# మొజ్తబాకు విదేశాల్లో ఆస్తులున్నాయా ఇరాన్ ఏమందంటే..!

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కి విదేశాల్లో ఆస్తులు ఉన్నట్లుగా పలు అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలపై ఆ దేశం స్పందించింది. తమ సుప్రీం లీడర్‌పై వస్తున్న ఈ వార్తలను తోసిపుచ్చింది. ఈ మేరకు స్పందించిన భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం.. అవన్నీ తప్పుడు వార్తలేనని, ఆ ప్రచారాలకు ఎటువంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

'మా మాజీ సుప్రీం అయతుల్లా ఖమేనీ మాదిరిగానే ప్రస్తుత సుప్రీం మొజ్తబా కి కూడా ఇరాన్ వెలుపల గానీ, విదేశాల్లో



గానీ ఎటువంటి ఆస్తులు లేవు. ఆయన నిరాడంబరమైన జీవితం గురించి ఇరాన్ ప్రజలకు బాగా తెలుసు. మొజ్తబాపై ఉన్న ప్రేమ, గౌరవంతోనే దేశ ప్రజలు ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. ఆయనపై తప్పుడు ప్రచారం చేయాలనే ఉద్దేశంతో కావాలనే కొందరు ఇలాంటి కథలు అల్లుతున్నారు. వీటిలో ఎంతమాత్రమూ నిజం లేదు' అని ఇరాన్ రాయబార కార్యాలయం పేర్కొంది.

**తీవ్రరూపం దాల్చిన సౌదీ అరేబియా-**

**హూతీల పోరు**

లండన్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయానికి ఎదురుగా మొజ్తబా ఖమేనీకి రెండు లగ్జరీ ఫ్లాట్లు ఉన్నాయంటూ ఇటీవల పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు రాశాయి. 2014, 2016లో వివిధ మధ్యవర్తుల ద్వారా వాటిని కొనుగోలు చేసినట్లుగా పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ ఆస్తులను ఆయన విక్రయానికి పెట్టినట్లుగా వచ్చిన వార్తా కథనాలను భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కొట్టిపారేసింది.

# స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను

**•టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్**

జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.



రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిదే

రాజకీయ విభేదాల పేరుతో వ్యక్తిగత దూషణలు సమర్థనీయం కాదు

దళితుల పట్ల వివక్షపూరిత మనస్తత్వం మారాలి

స్పీకర్ పై అనుచిత వాఖ్యలు చేసిన తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి

శాసనసభ స్పీకర్ వంటి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై ఓ ఎమ్మెల్సీ అసభ్య, అనుచిత పదజాలంతో చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్. తీవ్రంగా ఖండించారు. స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థతో పాటు శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసే చర్య అని ఆయన పేర్కొన్నారు.

రాజకీయ పార్టీల మధ్య, ప్రజాప్రతినిధుల మధ్య అభిప్రాయ భేదాలు ఉండటం సహజమేనని, ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు ప్రతి ప్రజాప్రతినిధికి ఉంటుందని ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అయితే రాజకీయ విభేదాలను వ్యక్తిగత దూషణలకు తీసుకెళ్లడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి కనీస బాధ్యత అని పేర్కొన్నారు.

దళితుల పట్ల వివక్షకు చరమగీతం

ప్రత్యేకంగా దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అత్యున్నత రాజ్యాంగ పదవిలో కొనసాగుతున్న సమయంలో ఆయనను అవమానించేలా మాట్లాడటం అత్యంత ఆందోళనకరమని ఎమ్మెల్యే అన్నారు. దళితులు ఉన్నత విద్యను అభ్యసించి, వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగి, అత్యున్నత పదవులను అలంకరిస్తున్నప్పటికీ వారిపై వివక్ష, చిన్నచూపు, అవమానకర వ్యవహారశైలి కొనసాగడం బాధాకరమన్నారు.

"పదవి మారినా గౌరవం మారకూడదు..వ్యక్తి సామాజిక నేపథ్యం కాదు,రాజ్యాంగ పదవే ప్రజాస్వామ్యంలో ప్రధానమైనది. రాజ్యాంగ పదవులను గౌరవించడం అంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమే" అని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్నా దళితుల పట్ల ఇలాంటి మానసిక వివక్ష కొనసాగడం సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశమని అన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవం కల్పించిందని, దళితులు ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా వారిని చిన్నచూపు చూసే మనస్తత్వం మారాల్సిన అవసరం ఉందని చెప్పారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి

ఒక దళితుడు అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్నప్పటికీ అవమానకర వ్యాఖ్యలకు గురికావడం ఒక వ్యక్తికి జరిగిన అవమానంగా మాత్రమే చూడకూడదని, సమాజంలో ఇంకా కొనసాగుతున్న వివక్షపూరిత ఆలోచనా ధోరణికి ఇది నిదర్శనమని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రజాప్రతినిధులు తమ హోదా, బాధ్యతలను గుర్తించి సంయమనంతో మాట్లాడాలని, పరస్పర గౌరవాన్ని పాటించాలని సూచించారు.

శాసనసభ ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుందని, అలాంటి పవిత్రమైన వ్యవస్థలో వ్యక్తిగత దూషణలకు తావులేకుండా ప్రతి సభ్యుడు వ్యవహరించాలని అయన అన్నారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్షాలకు చెందిన ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని స్పష్టం చేశారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సదరు ఎమ్మెల్సీపై శాసనసభ నియమావళి ప్రకారం స్పీకర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాసనసభ గౌరవాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ధాన్యం కొనుగోళ్లకు ముందస్తుగా ఏర్పాట్లు పూర్తి చేయాలి,

**•మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,**

జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8, 2026:



జిల్లాలో వానాకాలం 2026-27 సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు చర్యలు తీసుకొని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి. రాములు, మాట్లాడుతూ వానాకాలం 2026-27లో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గోదాములను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని, ధాన్యం కొనుగోళ్ల కొరకు సంబంధిత ఏజెన్సీలతో ముందస్తు సమావేశాలు నిర్వహించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎట్టి పరిస్థితులలోనూ లోతట్టు ప్రాంతాలలో ఏర్పాటు చేయరాదని, ఎత్తైన ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చదునుగా ఉన్న అనుకూల ప్రదేశాలను ఎంపిక చేసి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు తరచుగా అడిగే ప్రశ్నలుపై అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు విధానం తదితర అంశాలపై రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర అవసరమైన సదుపాయాలను ముందుగానే సమకూర్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్

జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.



ఆమనగల్లు మున్సిపాలిటీ 8వ వార్డుకు చెందిన మద్దురి జంగమ్మ. ఇంటి నిర్మాణానికి అవసరమైన నిర్మాణ సామగ్రిని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్. సహకారంతో. కౌన్సిలర్ రమేష్. అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్.ఎనమల్ల రమేష్. సైదులు, అంజి, మహేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ తాండలో సర్ ప్రక్రియను పరిశీలించిన ఎంపీడీఓ

జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.



అమనగల్లు మండలంలోని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న సర్ ప్రక్రియను మండల ఎంపీడీఓ జైరాం విజయ్. పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్. ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్,తో కలిసి సర్ ప్రక్రియ కొనసాగుతున్న తీరును పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జీపీఓ మనిల బిఎల్వోలు సరోజ, సరిత పాల్గొన్నారు. ఓటర్ల వివరాల పరిశీలన, నమోదు ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

## సింగరేణి సంస్థ పెగడపల్లి గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంది,



జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8:

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో పెగడపల్లి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని జైపూర్ సింగరేణి పవర్ ప్లాంట్ జిఎం సూర్యనారాయణ రాజు అన్నారు, మంగళవారం రోజున పెగడపల్లి గ్రామంలో చేపట్టబోయే అభివృద్ధి పనులు విషయమై పెగడపల్లి సర్పంచ్ రామగిరి రామన్నతో, కలసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు, ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు

# శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేటి పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ వివరాలు

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, సెప్టెంబర్ 9;



జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యులు.

మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేడు 10.9.2026 అనగా బుధవారం ఉదయం 10 గంటలకు దుర్గి మండలం శ్యామరాజుపురం గ్రామంలో జరిగే నూతన చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 10.30 గంటలకు దుర్గి మండలం శ్యామరాజుపురం గ్రామంలో నిర్వహించే నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు రెంటచింతల మండలం, మంచికల్లు గ్రామంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణాలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఉదయం 11.30 నిమిషాలకు మంచికల్లు గ్రామంలో నిర్వహించే నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. కావున అధిక సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని మాచర్ల శాసన సభ్యుల వారి కార్యాలయం తెలియజేసింది.

## భీమన్న సన్నిధిలో అభిషేకాలు కళ్యాణోత్సవాలు ప్రత్యేక పూజలు

జనసముద్రం న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా రూరల్ ప్రతినిధి సెప్టెంబర్ 8



శ్రావణ మాసంలో ఒక్కరోజులో నమోదైన ఆదాయాలలో ఇది అత్యధిక ఆదాయం కాగా

దేవాలయ చరిత్రలో హుండీ ఆదాయం మినహాయించి ఒక్కరోజులో నమోదైన ఆదాయాలలో ఇది రెండవ అత్యధిక ఆదాయంగా నిలిచింది

చివరి శ్రావణ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ విశేషంగా నెలకొంది ఈ సందర్భంగా భక్తులు నిర్వహించిన వివిధ అర్జిత సేవలు అభిషేకాలు కళ్యాణోత్సవాలు మరియు ఇతర ప్రత్యేక పూజల ద్వారా (హుండీ ఆదాయం మినహాయించి) ఒక్కరోజులో రూ.52,22,473/-ఆదాయం సమకూరింది శ్రావణ మాసంలో ఒక్కరోజులో నమోదైన ఆదాయాలలో ఇది అత్యధిక ఆదాయం కాగా దేవాలయ చరిత్రలో హుండీ ఆదాయం మినహాయించి ఒక్కరోజులో నమోదైన ఆదాయాలలో ఇది రెండవ అత్యధిక ఆదాయంగా నిలిచింది

శ్రావణ పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు అర్జిత సేవలు నిర్వహించారు భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసం శ్రావణ మాస మహిమ ఫలితంగా ఈ విశేష ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు ఈ వివరాలను ఆలయ పీఆర్వో శ్రీ పెరిక శ్రీనివాస్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## బోనాల పండుగ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి -- కుర్మేడు సర్పంచ్ చేన్నమ్మ, లాలయ్య

చింతపల్లి , సెప్టెంబర్ 8 (జనసముద్రం న్యూస్ ప్రతినిధి):




శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా చింతపల్లి మండలం కుర్మేడు గ్రామ ప్రజలందరికీ గ్రామ సర్పంచ్ కంబాలపల్లి చేన్నమ్మ, లాలయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో, ఐకమత్య భావంతో ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ దేవత అయిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి అనుగ్రహంతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని, యువతకు మంచి భవిష్యత్తు, విద్యార్థులకు విద్యాభివృద్ధి, మహిళలకు సౌభాగ్యం కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. గ్రామ ప్రజలందరూ పరస్పర సహకారంతో, సామరస్య వాతావరణంలో బోనాల వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఇంటిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుతూ కుర్మేడు గ్రామ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆరు నెలలుగా వెలగని స్ట్రీట్ లైట్లు




జనసముద్రం న్యూస్ ఘట్కేసర్ సర్కిల్ నాగారం ఈస్ట్

గాంధీనగర్ రోడ్ నెంబర్ 9

సాయిబాబా కాలనీ పార్కు పక్కన స్ట్రీట్ లైట్లు దాదాపు ఆరు నెలల నుండి వెలగడం లేదు ఇట్టి విషయము చాలాసార్లు చెప్పడం జరిగింది పై అధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్య తీసుకోలేదు కావున వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా వినాయక ఉత్సవాలు ఈ యొక్క పార్కులో జరుగుతాయి కాబట్టి వెంటనే స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయించగలరని సాయిబాబా కాలనీవాసులు కోరుచున్నారు

## గోడకొండ్లలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ





చింతపల్లి, సెప్టెంబర్ 8 (జనసముద్రం న్యూస్ ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చింతపల్లి మండలం గోడకొండ్ల గ్రామపంచాయతీలో మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ కాశగోని వెంకటయ్య లబ్ధిదారులకు తొలి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజాపంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారుతుందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేలా ఈ కార్డులు దోహదపడతాయని తెలిపారు. గ్రామ ప్రజలు తమ వివరాలను సరిచూసుకొని కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, పాలకమండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాలి

**స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాత మధుపై చర్యలు తీసుకోవాలి: కత్తి రవీందర్ రెడ్డి**

జన సముద్రం న్యూస్ నాంపల్లి నల్లగొండ సెప్టెంబర్ 8:



శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం శోభనీయంగా లేవని నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ అనేది రాజ్యాంగం కల్పించిన కీలకమైన పదవి అని ఆ పదవిలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం ప్రజాస్వామ్య సంప్రదాయాలను దెబ్బతీసే విధంగా ఉందని అన్నారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నా రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులే హద్దులు దాటి వ్యాఖ్యలు చేయడం సరికాదని రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా దళిత నేతను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సామాజికంగా కూడా ఆందోళన కలిగించే అంశమని అన్నారు. శాసనమండలి ప్రతిష్ట ప్రజాస్వామ్య విలువలను దృష్టిలో ఉంచు చర్యలు తీసుకోవడంతో పాటు తాత మధును శాసనమండలి నుంచి సస్పెండ్ చేయాలని కత్తి రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# మిల్లర్లు బియ్యాన్ని త్వరగా ప్రభుత్వానికి అందించాలి,

- భీమారంలో సమగ్ర ఓటర్ సర్వే పరిశీలన,
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8, 2026:**
రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బియ్యాన్ని త్వరగా అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలం అంకుశాపూర్ గ్రామంలో గల సమతా రైస్ మిల్ ను ఆకస్మికంగా సందర్శించి రైస్ మిల్లు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ రైతుల సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి సేకరించిన ధాన్యాన్ని సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించడం జరిగిందని, రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భీమారం మండలంలోని మద్దికల్ గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, మురుగు కాలువలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని తెలిపారు. నీటి నిల్వలు లేకుండా శుభ్రపరచాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి




నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేయాలని, నిర్దేశిత విస్తీర్ణంలో నిర్మించిన ఇండ్లకు మాత్రమే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామంలో కొంతమంది రైతులు వరి సాగు చేయడాన్ని గమనించి వారితో మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. పంట సాగుకు బోర్లు, చెరువు అందుబాటులో ఉండడంతో వరి సాగు చేస్తున్నామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో భాగంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియలో నిర్దేశిత విధానాలను పాటించాలని, ఫీల్డ్ రిజిస్టర్, విలేజ్ రిజిస్టర్ లలో వివరాలు నమోదు చేస్తూ సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. రీ సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, విచారణ కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం తయారీలో శుభ్రత నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచించారు. 6వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి స్వయంగా వారికి పాఠ్యాంశాలు బోధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టిక, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని సందర్శించి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమాలలో మండల తహసిల్దార్ సదానందం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి పంటకు నష్టం చేస్తున్న కాండం తొలిచేపురుగు

--రైతులు జాగ్రత్తగా కనిపెట్టాలి
--నివారణకు వ్యవసాయాధికారులను సంప్రదించాలి
-- వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్

**జనసముద్రం న్యూస్ కోహెడ సెప్టెంబర్ 8:**
**( కోహెడ ప్రసాదరావు)**



ప్రస్తుతం వరి పంటలో కాండం తొలిచే పురుగు (స్టెమ్ బోరర్) మరియు ఉల్లికోడు సమస్య అధికంగా ఉందని వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్ సూచించారు.
సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెళ్ళ గ్రామంలో పంట పొలాలను ఆయన మంగళవారం సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు.ప్రస్తుతం వరి పంట పీలక, చిరు పొట్ట దశలో ఉండగా, ఈ దశలో కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పురుగు ఆశించినప్పుడు వరి మొక్క మధ్య కాడలోకి ప్రవేశించి పంటకు నష్టం కలిగిస్తుందని వివరించారు. పీలక దశలో పురుగు ఆశించినట్టయితే మధ్య కాడ ఎండిపోవడంతో పాటు హార్ట్‌బ్లైట్ లక్షణం కనిపిస్తుందని చెప్పారు.మొక్కను లాగితే సులభంగా బయటకు రావడం, కాండంలో పురుగు లేదా దాని విసర్జన పదార్థాలు కనిపించడం వంటి లక్షణాలను రైతులు గుర్తించాలని సూచించారు.అవసరానికి మించి లేదా విచక్షణారహితంగా పిచికారీ చేయకుండా, సూచించిన మందులను మాత్రమే వినియోగించాలని తెలిపారు. పొలాల్లో అధికంగా నత్రజని ఎరువులు ఉపయోగించకుండా సమతుల్య ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలని సూచించారు.పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు/ఎకరం, క్లోరంట్రానిలిప్రోల్ 60 మి.లీ./ఎకరం లేదా ఇథోఫెన్‌ప్రాక్స్ 120 మి.లీ./ఎకరం చొప్పున పిచికారీ చేసుకోవడం ద్వారా పురుగు ఉధృతిని నియంత్రించవచ్చని తెలిపారు.అలాగే ఉల్లికోడు నివారణకు తయామెథక్సం 25 శాతం డబ్ల్యూ జి ఎకరానికి 40గ్రా చొప్పున లేదా ఫిప్రోనిల్ 5 శాతయాజ ఎస్సీ 2మీ.లీ/ లీటర్ నీటికి పిచికారి చేయాలని సూచించారు.రైతులు పంటను నిరంతరం పరిశీలిస్తూ, పురుగు లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి పట్ల బిఆర్ఎస్ నిరసనలు

--హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా, ర్యాలీ
--పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్

**జనసముద్రం న్యూస్ కోహెడ, సెప్టెంబర్ 8:**
**(కోహెడ ప్రసాదరావు)**




తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహరించాలని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా, నిరసన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళా నాయకులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు.
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తుంటే వారిని పోలీసులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ తీవ్రంగా ఖండించారు.
ముఖ్యంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా పోలీసులు దురుసుగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించదగిన విషయమని అన్నారు.
“అసెంబ్లీ సాక్షిగా మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి ప్రవర్తన జరగడం తెలంగాణ సమాజం సిగ్గుపడే విషయం. మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒకవైపు మహిళా సాధికారత గురించి మాట్లాడుతూనే మరోవైపు మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులతో ఇలా వ్యవహరించడం బాధాకరమని అని సతీష్ కుమార్ ప్రశ్నించారు.
మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు ప్రతి మహిళా సమాజం స్పందించాలని,
మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటన కేవలం బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన విషయం కాదని, ప్రజాస్వామ్యాన్ని, మహిళా గౌరవాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అంశమని సతీష్ కుమార్ అన్నారు.
ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా ప్రజాప్రతినిధులకే రక్షణ, గౌరవం లేకపోతే రాష్ట్రంలోని సామాన్య మహిళలకు ఈ ప్రభుత్వం ఏ విధంగా భరోసా కల్పిస్తుందని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిని అడ్డుకోవడం ద్వారా మహిళల గొంతుకను కూడా అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు.
సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు ప్రజల్లోకి బీఆర్ఎస్ పోరుబాట
కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టామని సతీష్ కుమార్ తెలిపారు.నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు.
రైతుల సమస్యలు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్, రైతు సంక్షేమం, మహిళలకు ఇచ్చిన హామీలు, యువతకు సంబంధించిన అంశాలు తదితర ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.
ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెస్తాం
“సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వరుసగా నిర్వహించిన కార్యక్రమాలతో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. అయినా ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే వరకు, ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ వెనక్కి తగ్గదు” అని వొడితల సతీష్ కుమార్ స్పష్టం చేశారు.
ప్రజా సమస్యలపై ప్రశ్నించే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీలో అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను దాచిపెట్టలేరని అన్నారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ప్రభుత్వం తప్ప పోలీసులు కాదని వ్యాఖ్యానించారు.
“ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం అంటే ప్రజల గొంతును అడ్డుకోవడమే. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలి. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలి. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. లేదంటే ప్రజలతో కలిసి బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంది” అని వొడితల సతీష్ కుమార్ హెచ్చరించారు.
హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన భారీ ధర్నా అనంతరం చేపట్టిన నిరసన ర్యాలీలో మహిళలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువత,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

# గణేష్ ఉత్సవాల నిర్వహణపై నిర్వాహకులకు పోలీసుల అవగాహన సమావేశం




**చింతపల్లి, సెప్టెంబర్ 8 (జనసముద్రం న్యూస్ ప్రతినిధి):**
గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలతో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి మాట్లాడుతూ ఉన్నతాధికారులు జారీ చేసిన మార్గదర్శకాలను వివరించారు. విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపులు, ట్రాఫిక్ నియంత్రణ, శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.
గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి కోరారు. సమావేశంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడి యత్నాన్ని ఖండిస్తూ పోలీసులకు ఫిర్యాదు

**చింతపల్లి, సెప్టెంబర్ 8 (జనసముద్రం న్యూస్ ప్రతినిధి):**
తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ఫామ్‌హౌస్‌పై కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ చింతపల్లి మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్ రెడ్డి సోమవారం చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా దొంతం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి నివాసంపై దాడికి ప్రయత్నించడం పూర్తిగా అప్రజాస్వామిక చర్య అని అన్నారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణిని విరమించి రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను



కోరారు. అలాగే కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే కె. శంకరయ్యపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శి వింజమూరి రవి, ధేన్యతండ సర్పంచ్ రమావత్ కొండల్ నాయక్, సిమర్ల శ్రీను యాదవ్, దండేటికార్ ప్రసాద్, దాస్ నాయక్, వింజమూరి అబ్బయ్య, నల్ల శంకర్, చందర్ నాయక్, ధన్‌రాజ్, ఆరెకంటి జంగయ్య, వింజమూరి లక్ష్మయ్య, వింజమూరి కళ్యాణ్, నర్సింహా, వింజమూరి శంకర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# సబితా ఇంద్రారెడ్డిపై ఘటనకు నిరసనగా అట్టుడికిన మహేశ్వరం

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శ్రేణుల డిమాండ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిది శ్రీకాంత్ గుప్తా (సెప్టెంబర్ 8)జనసముద్రం**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై అసెంబ్లీ సాక్షిగా జరిగిన ఘటనకు నిరసనగా మహేశ్వరం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాయి. నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు భారీ సంఖ్యలో పాల్గొని ఘటనను తీవ్రంగా ఖండించారు.
మహిళా ప్రజాప్రతినిధిపై అనుచితంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని నాయకులు మండిపడ్డారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ



సహించబోమని స్పష్టం చేశారు. ఘటనకు బాధ్యులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
“ఇది కేవలం ఒక నాయకురాలికి జరిగిన అవమానం కాదు” అని నాయకులు పేర్కొన్నారు. రాజకీయ భేదాలు సహజమే అయినప్పటికీ వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే చర్యలకు తావు ఉండకూడదన్నారు. మహిళా ఎమ్మెల్యేల గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, ప్రజాప్రతినిధుల పట్ల మర్యాదను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఘటనపై సమగ్ర విచారణ జరిపి



వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.మహేశ్వరం గడ్డ నుంచి ఒక్కటే నినాదం--- మహిళా గౌరవాన్ని కాపాడాలి.. ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి.. అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజల గొంతు వినిపించాలి!

# గణేష్ ఉత్సవ నిర్వహణలో నిబంధనలు ఎస్పీ

**జనసముద్రం న్యూస్ రాజన్న సిరిసిల్ల రూరల్ ప్రతినిధి సెప్టెంబర్ 8**



గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే సూచించారు గణేష్ ఉత్సవాల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని మండపాల నిర్వాహకులకు స్పష్టం చేశారు సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మండపాల నిర్వాహకులు స్థానిక కౌన్సిలర్లతో పోలీసుల సమన్వయ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత ఏడాది నిమజ్జనం సందర్భంగా జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించారని తెలిపారు ఇబ్బందులకు పాల్పడిన వారిపై ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు చెప్పారు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

# హామీలు విస్మరించిన ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం

**●అసెంబ్లీకి రాకుండా అరెస్టులు చేయించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు**

**●ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా?**

**-- లింగాల కమల్‌రాజు**

**బోనకల్, ఖమ్మం జిల్లా, జనసముద్రం న్యూస్ ప్రతినిధి, సోమవారం, సెప్టెంబర్ 7:**



ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న భారత రాష్ట్ర సమితి శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులను అసెంబ్లీకి రాకుండా అక్రమంగా అరెస్టు చేయించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టువంటిదని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, భారత రాష్ట్ర సమితి మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు తీవ్రంగా మండిపడ్డారు. ఈ చర్యలను నిరసిస్తూ సోమవారం బోనకల్ మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు అసెంబ్లీలో ప్రజల గొంతుకగా నిలిచే హక్కు ఉందని, ఆ హక్కును కాలరాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయవచ్చని ప్రభుత్వం భావిస్తే అది వారి భ్రమ మాత్రమేనని, ప్రజల తరఫున తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా విస్మరిస్తోందని కమల్‌రాజు ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? రైతు భరోసా పరిస్థితి ఏమిటి? యువతకు ప్రకటించిన ఉద్యోగాల మాట ఏమైంది? మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ అమలవుతున్నాయి? పేదలకు ఇళ్ల హామీ ఏమైంది? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ, తమ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై అరెస్టులు, నిర్బంధాలు ప్రయోగించడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చాలని చూస్తున్నారని విమర్శించారు. హామీలు అమలు చేయాలని అడిగితే అరెస్టులు చేస్తారా? ప్రజల సమస్యలను సభలో ప్రస్తావిస్తే గొంతు నొక్కుతారా? అని నిలదీశారు.

అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని, హామీల నుంచి తప్పించుకోవడానికి ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పక తప్పదని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రశ్నించడం సహజమని, ప్రశ్నించే హక్కును హరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలపై ఎన్ని అక్రమ కేసులు, అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఆపేది లేదని లింగాల కమల్‌రాజు తేల్చిచెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు, బోనకల్ ఉపసర్పంచ్ బానోత్ కొండ, సర్పంచ్ బానోత్ జ్యోతి, మండల కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పార ప్రసాద్, మాజీ రైతుబంధు మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్, గుండపనేని సుధాకర్‌రావు, బంధం నాగేశ్వరరావు, ఎస్సీ విభాగం నాయకులు గద్దల వెంకటేశ్వర్లు, కనకయ్య, కంచర్ల అచ్చయ్యతో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్యానందం కుటుంబానికి ఆర్థిక సహకారం అందజేసిన జిల్లా బృందం

**●సత్యానందం కుటుంబానికి టీ డబ్ల్యూ జె ఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది**

**●టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖదీర్**

**బోనకల్, ఖమ్మం జిల్లా, జనసముద్రం న్యూస్ ప్రతినిధి, మంగళవారం, సెప్టెంబర్ 8:-**



మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన విజన్ ఆంధ్ర విలేకరి మంద సత్యానందం కుటుంబానికి టీ డబ్ల్యూ జేఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వ సాగర్, జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు అన్నారు. టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సేకరించిన నగదును గోవిందాపురం ఎల్ గ్రామంలో సత్యానందం భార్య సుమంత్ కు మంగళవారం వారు అందజేశారు. సత్యానందం చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంద రోడ్డు ప్రమాదంలో అతి పెద్ద వయసులోనే మృతి చెందటం బాధాకరం అన్నారు. సత్యానందం ముగ్గురు పిల్లలకు చదువులో అవసరమైన పూర్తి సహకారం యూనియన్ తరపున అందిస్తామన్నారు. ఇల్లు లేని సత్యానందం భార్యకు ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వారు అధికారులను కోరారు. ఇందిరమ్మ ఇల్లు కోసం అవసరమైతే జిల్లా కలెక్టర్ ను కలిసి విజ్ఞప్తి చేస్తామని అన్నారు. మండల అధికారులు ఇందిరమ్మ మంజూరు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సత్యానందం వృత్తిలో ఎంతో చురుకుగా ఉండేవాడు అన్నారు. భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించవలసిన సత్యానందం రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం మమ్మలను కలవరపాటుకు గురిచేసింది అన్నారు. యూనియన్ తరపున కుటుంబానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా నాయకులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, మండల నాయకులు జక్కుల రామారావు మాగి ముఖేష్, తెల్లబోయిన సుమన్, సర్పంచ్ మంద కరుణ, తదితరులు పాల్గొన్నారు.

# కేసిఆర్ హత్యకు రేవంత్ రెడ్డి కుట్ర.

**డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బిఆర్ఎస్.**



కేసిఆర్ హత్యకు రేవంత్ రెడ్డి కుట్ర. చేశారని ఆరోపించారు లిస్పీకర్ దళితుడు అంటూ కాంగ్రెస్ మంత్రులే అవమానించారనీ రాష్ట్రంలో అరాచక పాలన.దుశ్శాసన పర్వం నడుస్తుందనీ మండిపడ్డారు ఈ రోజు సిట్టింగ్ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలంగాణ సాధకులు, ప్రతిపక్ష నేత, కేసిఆర్ గారిపై ఘోరమైన భాష.కేసిఆర్ చావు కోరుకుంటున్నాం.. అందుకే వెయ్యి డప్పులతో ర్యాలీ తీస్తున్నాం అంటూ మాట్లాడారన్నారు కేసిఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే అయ్యేవాడు కాదు, రేవంత్ రెడ్డి సిఎం అయ్యే వాడు కాదనీ ఇది కేసిఆర్ ని మాత్రమే కాదు, కాంగ్రెస్ అధికార మదంతో అవినీతి ఊబిలో చిక్కుకొని తెలంగాణ ఉద్యమకారులందరిని అవమానించినట్టే. కేసిఆర్ చావు కోరుతే,ఉద్యమకారుల చావును కోరుకున్నట్టే. అనీ పేర్కొన్నారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మార్గ దర్శకులు రేవంత్ రెడ్డి.రేవంత్ రెడ్డి కూడా ఇదే భాష కొల్లాపూర్,కొడంగల్ లో సభల్లో మాట్లాడారు. మార్చురీ,స్ట్రేచర్ అంటూ వ్యాఖ్యానించారనీ ఇలాంటి క్రూరమైన భాషను ఖండిస్తూ ఈ రోజు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాం. అని పేర్కొన్నారు వెంటనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. అటేన్షన్ డైవర్షన్ లో రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడు. ఎస్సీ, గిరిజనుల హక్కులను కాలరాస్తూ,వారి భూములను 22ఏ కింద చేర్చి,దళిత బంధు లాంటి పథకాలు అమలు చేయకుండా మోసం చేశారనీ మండిపడ్డారు సిఎం రేవంత్ రెడ్డి, హోం మంత్రిగా లక్ష మంది పోలీసులను దగ్గర పెట్టుకొని ఈ రోజు ... ప్రతి పక్ష నాయకుడు కేసిఆర్ ఇంటికి , కాంగ్రెస్ గుండాలను కొందరు ఎమ్మెల్యేల నాయకత్వంలో దాడికి పంపారు. పోలీస్ ఎస్కార్ట్ తో కాంగ్రెస్ నాయకులు కేసిఆర్ నివాసం పై దాడికి వెళ్తున్నారు. రేవంత్ రెడ్డికి శాంత్ భద్రతల మీద శ్రద్ధ లేదనీ ఆరోపించారు ప్రతిపక్ష నాయకుడికి ఇచ్చే గౌరవం ఇదేనా? కేసిఆర్ లేకుంటే సిఎం అయ్యేటోనివా రేవంత్ రెడ్డి, 200 కోట్ల భవనం కట్టుకునేవాడివా.? కేసిఆర్ సిఎం గా ఉన్నపుడు అల్లరి మూకలను ఏనాడైనా మీ ఇంటికి పంపారా? వేముల వీరేశం బీర్ల ఐలయ్య అనిల్ కుమార్ రెడ్డి వంటి నేరచరిత ఉన్నవారి నాయకత్వంలో పంపి దాడికి యత్నం. అని కేసిఆర్ హత్యకు కుట్ర. ఈ కుట్రను తెలంగాణ మరిచిపోదనీ బిఆర్ఎస్ నాయకులు ఎర్రవల్లికి పోతుంటే అందరిని అడ్డుకుని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు పంపారు. కాంగ్రెస్ వాల్లను మాత్రం అడ్డుకోకుండా పోలీస్ ఎస్కార్ట్ ఇచ్చి ఫాం హౌస్ కు పంపారనీ పేర్కొన్నారు తాజా మధు, నవీన్ రెడ్డి నిద్ర లేవకముందే ,పోలీసులు ఇంటికి వెళ్లి వీరిని అరెస్ట్ చేసి,పోలీస్ స్టేషన్ తీసుకెళ్లారు. అక్కడి నుండి జడ్జి ఇంటికి తీసుకెళ్లి,తదనంతరం కోర్టుకు వెళ్లి జైలులో పెట్టాలని చూశారు. 7/9 న అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ విడుదలైంది. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించాలని కేసిఆర్ దిశానిర్దేశం చేశారనీ అన్నారు బిఆర్ఎస్ నల్ల టీ షర్ట్ ధరించి వెళ్లారు. దాని పై ఎలాంటి బూతులు లేవు, ఎవరిని తిట్టినట్టు లేదు, ఎవరి పేర్లు లేవు. రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ సోనియా గాంధీలను నిందించలేదు, అగౌరవపరచలేదన్నారు తొండలు,పేగులు,గోటీల భాష టీ షర్ట్స్ మీద వాడలేదు.రేవంత్ రెడ్డి గురువు,చంద్రబాబు కూడా గతంలో ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ రాసి ఉన్న నల్ల చొక్కా ధరించి అసెంబ్లీకి వచ్చారు. రాహుల్ గాంధీ మోడీ అదానీ ఏక్ హై, అదాని సేఫ్ హే అని నినాదంతో వెళ్లారనీ తెలిపారు ప్రియాంక గాంధీ కూడా అదే నినాదంతో వెళ్లారు. చంద్రబాబు,రాహుల్, ప్రియాంక గాంధీలను ఆనాడు ఎవరు ఆపలేదనీ అలాంటపుడు బిఆర్ఎస్ నాయకులను ఎందుకు ఆపారు. టీ షర్ట్ లేకపోయినా... మహిళ ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, సబిత ఇంద్రారెడ్డి, కోవా లక్ష్మి లను మగ పోలీసులు అడ్డుకున్నారనీ ఆరోపించారు కింద పడేసి, చీర పట్టి లాగారు. సబితా ఇంద్రా రెడ్డి గారిని జుట్టు పట్టి లాగి గొంతు పిసికారు. చంపాలనుకున్నారా? దేశంలోనే మొదటి మహిళా హోం మంత్రి అని కూడా చూడలేదు. సోదరీమణులు సహచరులపై అఘాయిత్యం జరిగితే ఎవరూ ఊరుకోరు. అందుకే తాతామధు, నవీన్ రెడ్డి గారి రక్తం మరిగింది. పైగా పోలీసులు తాతా మధు ప్యాంటు లాగారనీ తెలిపారు మహిళలపై అమానుష దాడిని తట్టుకోలేక ఆవేశములో స్పీకర్ గారిని గాడు అని సంభోదించారు. తర్వాత క్షమాపణ కోరారు. వివరణ ఇచ్చి విచారం వ్యక్తం చేశారు. ఎవరిని కులం పేరుతో దూషించలేదని వివరణ ఇచ్చారు. విచారం వ్యక్తం చేస్తూ... వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నారన్నారు తాతా మధు, నవీన్ రెడ్డి గారి అరెస్టుకు సంబంధించిన గ్రౌండ్స్ లో పోలీసులు కూడా కులం పేరుతో దూషించినట్టుగా చెప్పలేదు. ఎక్కడ కూడా స్పీకర్ అమ్మ గారిని దూషించలేదు. మా అమ్మ మీ అమ్మ ఎవరైనా ఒకటే. అని స్పీకర్ ను నిజంగా అవమానించింది కాంగ్రెస్ వాల్లే. దళిత దళిత దళిత అంటూ నిరంతరం అవమానిస్తున్నారు. మాజీ మంత్రి పరిపాలనా దక్షత, ప్రతిభ ఆధారంగానే స్పీకర్ అయ్యారు. కానీ దళితుడు కాబట్టి స్పీకర్ అయ్యాడని పదే పదే అవమానిస్తున్నారు. శ్రీధర్ బాబు,సీతక్క, అడ్లూరి వరకు ప్రతి ఒక్కరూ దళిత స్పీకర్ అంటూ అవమానించారనీ వివరించారు సీతక్క మీ అమ్మ మీ భార్య అంటూ కావాలని మళ్లీ మళ్లీ గుర్తు చేస్తూ అవమానిస్తూ ఏడిపించారనీ డ్రామాలు నాటకాలు చేస్తున్నారని సీతక్క మాట్లాడారు. ఆ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి. అసెంబ్లీ కి రాకుండా, టీషర్ట్ లేకున్నా, మగ పోలీసులతో అడ్డుకున్నది ఎవరు.? సీతక్క సమాధానం చెప్పాలనీ ఒక మహిళ మంత్రిగా, సాటిమహిళ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను కనీసం మీరు పరామర్శించి, ఓదార్చాలి కదా.. అలా చేయలేదు, పైగా డ్రామాలు నాటకాలు అంటున్నారనీ తెలిపారు సునీత ఏడ్వడం నాటకమా? మీ మనస్సాక్షిగా మాట్లాడుతున్నారా రేవంత్ స్క్రిప్ట్ చదువుతున్నారా? ఆత్మపరిశీలన చేసుకోండి. అడ్లూరి కూడా అసెంబ్లీలో బూతులు మాట్లాడుతున్నారనీ ధ్వజమెత్తారు రేవంత్ రెడ్డి గారు వేముల వీరేశం గురించి ఏం మాట్లాడారో మరిచిపోలేదు. నల్గొండ క్లాక్ టవర్ వద్ద పిర్రలు పలిగేటట్టు కొడుత అన్నరు. ఈ రోజు అదే వేముల వీరేశం గ్యాంగ్ ను వేసుకొని కేసిఆర్ ఫాం హౌజ్ కు వెళు _న్నారన్నారు వేముల వీరేశం అంబేద్కర్ ఆత్మగౌరవంతో బతకాలని చెప్పారు,ఇతరులకు తొత్తులుగా కాదు.మహబూబ్ నగర్ లో మాదిగొల్ల జిల్లా మాదిగలు దప్పులు కొట్టాలని అవమానించారు. అపుడు అవమానంగా ఎందుకు భావించలేదు వీరేశం అని ఉప ముఖ్యమంత్రి భట్టిని యాదాద్రిలో కింద కూర్చోబెట్టారు. అది అవమానం కాదా?. గోచీ కట్టుకుంటే కూడా ఓర్వకుండా... గోచీ కట్టుకున్న వాల్లందరూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలేరంటూ అవమానించారన్నారు నిన్న గాక మొన్న నకిరేకల్ లో 100 పడకల దవాఖాన ప్రాంభోత్సవామికి హెల్త్ మంత్రిని పిలవకుండా అవమానించారు. స్పీకర్ గౌరవం,ఆత్మగౌరవానికి భంగం కలిగేలా మాట్లాడింది కాంగ్రెస్ నాయకులే. అని మనుషులను మనుషులుగా గౌరవించేది కేసిఆర్. వారు కుట్రలు కుతంత్రాలు చేయరు.దేశంలో ఎవరూ చేయలేని గొప్పపనులు కేసిఆర్ చేశారు. ఏఐ ని అడిగినా చబుతుందన్నారు దళిత బంధు ఆలోచన దేశంలో ఏ ముఖ్యమంత్రికి రాలేదు. 3 ఎకరాల భూమి 1000 గురుకులాలు ఎస్సీ సబ్ ప్లాన్ పెట్టారు. గిరిజనుల రిజర్వేషన్ 6 నుండి 10 శాతం పెంచారు. స్పెషల్ డెవలప్ మెంట్ కింద 90 వేల కోట్లు ఖర్చు చేసిన గొప్ప వ్యక్తి కేసిఆర్ రాహుల్ గాంధీ పుట్టుక గురించి బిజెపి ముఖ్యమంత్రి హేమంత బిశ్వ శర్మ మాట్లాడితే అసెంబ్లీలో తీర్మానం చేసి ఖండించిన నాయకుడు కేసిఆర్. అని స్పీకర్ తల్లిని ఏమనకపోయినా కావాలని, సీతక్క స్పీకర్ గారికి ఆపాదించి అవమానిస్తున్నారన్నారు

మందుల సామేలు ఇంటి మీద బిజెపి వాల్లు దాడి చేస్తే సీతక్క ఎందుకు మాట్లాడలేదు. వందల మంది విద్యార్థులు గురుకులాల్లో శవాలైతే, ఎందుకు కన్నీళ్లు రాలేదు సీతక్క గారికి. అని కర్ల రాజేష్ లాకప్ డెత్ అయితే ఎందుకు మాట్లాడలేదనీ విమర్శించారు శిరీష అనే అదివాసి అమ్మాయి రేప్ కు గురై హత్య గావించబడితే, హోం మంత్రిని తీసుకొని వెళ్లి సీతక్క ఎందుకు పరామర్శించలేదు? ఎర్ర రాజశేఖర్ హత్యను సీతక్క ఎందుకు ఖండించలేదు, ఎందుకు ఆక్రోశం రాలేదనీ పేర్కొన్నారు గురుకులాల్లో విద్యార్థులు విషాహారం తిని హాస్పిటల్ లో పడితే ఎందుకు మాట్లాడలేదు అడ్లూరి అని మేం కూడా రాజకీయాలు చేయగలం. కానీ మీలాగా నికృష్ట రాజకీయాలు చేయం. కేసిఆర్ గారికి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశారు కేసిఆర్ ను చంపాలనే కుట్రతోనే వేల మందిని పోలీసు బందోబస్తుతో పంపారు. వీర్లపల్లి శంకర్ పై వెంటనే కేసు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు

స్పీకర్ గారు రేవంత్ రెడ్డి ఉచ్చులో పడింది. వారి రాజకీయాల కోసం మీ కుర్చీ వాడుకుంటున్నారు.

మిమ్మల్ని పదే పదే దళిత స్పీకర్ అంటూ అవమానిస్తున్నారు.

చేపలు పట్టుకొనే శ్రీహరిని మంత్రిని చేశానంటూ ఆయనను అవమానించారన్నారు

తాతా మధు, నవీన్ రెడ్డి అరెస్ట్ ను తప్పుపట్టింది కోర్టు. కాంగ్రెస్ నాయకుల తప్పుడు ప్రచారాలకు కోర్టు తీర్పుతో చెంప చెల్లుమంది.

22ఏ, రైతు,నిరుద్యోగ,పాలిటెక్నిక్, దోపిడీలపై అసెంబ్లీలో చర్చ జరగాలన్నారు

## ఎత్తిపోతల లో నేడు నూతన ఎడ్వన్చర్ ప్రారంభించనున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



ఎత్తిపోతల లో ఏర్పాటు చేసిన నూతన ఎడ్వన్చర్

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, సెప్టెంబర్ 8;**



జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే.

పల్నాడు జిల్లా మాచర్ల మండల పరిధిలోని ఎత్తిపోతల జలపాతం వద్ద రెయిన్ బో ఎంటర్టైన్మెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏపీటీడీసీ నేతృత్వంలో ఇక్కడికి వచ్చే పర్యాటకుల కోసం సరికొత్త ఎడ్వన్చర్ ను ఏర్పాటు చేశారు. ఈ నూతన ఎడ్వన్చర్ ను నేడు 9.9.2026 అనగా బుధవారం మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించనున్నారు.

## ఖమ్మం ఎల్ఐసీ కార్యాలయంలో ఘనంగా ముగిసిన 70వ బీమా వారోత్సవాలు.



**ఖమ్మం, జనసముద్రం న్యూస్ ప్రతినిధి, మంగళవారం, సెప్టెంబర్ 8:**

– ా×జ ఆఫ్ ఇండియా, ఖమ్మం శాఖలో సెప్టెంబర్ 1, 2026 నుండి సెప్టెంబర్ 7, 2026 వరకు జీవిత బీమా వారోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. సెప్టెంబర్ 1న జ్యోతి ప్రజ్వలనతో ఈ వారోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 2న ఏజెంట్ల దినోత్సవాన్ని నిర్వహించారు. సెప్టెంబర్ 3న అభివృద్ధి అధికారుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

ౖ వారోత్సవాల ముగింపు రోజైన సెప్టెంబర్ 7న మానసిక వికలాంగుల కేంద్రం (మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల కేంద్రం, రాపరిత నగర్) నందు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆటల పోటీలు ు బహుమతులు: ఈ వారోత్సవాల సందర్భంగా ఉద్యోగులకు వివిధ ఉల్లాసభరితమైన కార్యక్రమాలు మరియు ఆటల పోటీలు నిర్వహించారు. నిన్న సాయంత్రం జరిగిన ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ బాలాజీ నాయక్ అధ్యక్షత వహించగా, ఏటీఎం శ్రీ జె. హేమావతి, శరత్ చంద్ర, రోహన్ రెడ్డి, సుధీర్ కుమార్, మంగ?, ఎన్. వనిత మరియు ఇతర యూనియన్ ప్రతినిధులు, సిబ్బంది, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజాశ్రేయసే ధ్యేయంగా నిత్యం శ్రమిస్తున్న నాయకుడు - పోలిన శ్రీనివాసరావు



ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలిసి ప్రజాసేవలో నిత్యం శ్రమిస్తున్న ద్వారకాతిరుమల సహకార సంఘం చైర్మన్ పోలిన శ్రీనివాసరావు



**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా సెప్టెంబర్ 8 ద్వారకాతిరుమల**

నిజాయితీ, నిబద్ధతలకు మారుపేరుగా ప్రజాక్షేత్రంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర విశాల సహకార సంఘం చైర్మన్ పోలిన శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకున్న ఆయన అంచెలంచెలుగా ఎదుగుతూ రాజకీయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. ముక్కుసూటితనం, నిజాయితీతో తెలుగుదేశం పార్టీని ప్రాణంగా భావిస్తూ పార్టీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారు.మాట కటువుగా ఉన్నా మనసు వెన్నలాంటి వ్యక్తిత్వం ఆయనది. ప్రజలకు ఆపద వస్తే అరక్షణం కూడా ఆలోచించకుండా ముందుండే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు అత్యంత ఆత్మీయులుగా మెలుగుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు.ఉన్నత చదువులు లేకపోయినా సమాజాన్ని క్షుణ్ణంగా చదివిన జ్ఞానశీలిగా, నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతవరకైనా వెళ్లే వ్యక్తిగా ఆయనకు పేరుంది. నేడు జన్మదినం జరుపుకుంటున్న ఆయనకు పార్టీ శ్రేణులు, అభిమానులు, సహకార సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

# నాని 'ది ప్యారడైజ్' రిలీజ్ డేట్‌పై క్లారిటీ




నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీని సెప్టెంబరు 24న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. అయితే, మరోసారి 'ది ప్యారడైజ్' వాయిదా పడుతుందంటూ గత రెండు మూడు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఇంకా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాలేదని, ఒక పాటను కూడా షూట్ చేయాల్సి ఉందని ఆ పోస్టుల సారాంశం.ఆ వార్తలన్నింటికీ చెక్ పెడుతూ మూవీ విడుదల విషయంలో ఎలాంటి మార్పూ లేదని చిత్ర బృందం మరోసారి ప్రకటించింది. ఇందుకు సంబంధించి సెప్టెంబరు 24న రిలీజ్ డేట్‌తో కూడిన పోస్టర్‌ను విడుదల చేసింది. అంతేకాదు, 23వ తేదీ రాత్రి స్పెషల్ ప్రీమియర్లను కూడా ప్రదర్శించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. తెలుగుతో పాటు, ఇతర భాషల్లోనూ ఈ మూవీని విడుదల చేయనున్నారు.విజయవంతమైన 'దసరా' తర్వాత కథానాయకుడు నాని – దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రానున్న సినిమా ఇది. ఇందులో నాని 'జడల్' పాత్రలో కనిపించనున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' మంచి టాక్‌ను సంపాదించుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. నానితో పాటు ఈ మూవీలో మోహన్‌బాబు, తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయికగా మెరవనున్నారు.

# విజయ్‌తో సినిమా.. త్రిష నుంచి వచ్చిన మెసేజ్ ఇదే: మాళవిక మోహనన్



ఇండస్ట్రీలో త్రిష లాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారన్నారు నటి మాళవిక మోహనన్. కొత్త వాళ్లను ఆమె ఎంతో ప్రోత్సహిస్తారని తెలిపారు. 'సర్దార్ 2' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాళవిక మాట్లాడుతూ త్రిషతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. రజనీకాంత్ ప్రధానపాత్రలో తెరకెక్కిన 'పేట' సినిమాలో ఆమెతో కలిసి వర్క్ చేసిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ఆమె తనను ఎంతో ఆప్యాయంగా పలకరించారని తెలిపారు."నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో 'పేట' అవకాశం వచ్చింది. రజనీకాంత్ సినిమా కావడంతో ఎంతో ఆనందించా. కానీ, కమర్షియల్ సినిమా చేసిన అనుభవం లేకపోవడంతో కంగారుపడ్డాను. వారణాసిలో షూటింగ్ జరిగిన వేళ త్రిషతో కలిసి కొన్ని కాంబినేషన్ సీన్లలో నటించాను. అప్పుడే తనతో పరిచయం ఏర్పడింది. ఎంతో బాగా చూసుకున్నారు. ప్రతి విషయంలోనూ నన్ను భాగం చేసేవారు. పరిశ్రమలో చాలా మంది ఎవరి పని వారు చేసుకొని వెళ్లిపోతారు. కానీ, త్రిష కొత్తవారిపై కూడా ఆదరణ చూపిస్తారు. చాలా తక్కువ మంది మాత్రమే అలా చేయగలరు"."ఆ తర్వాత విజయ్‌కు జోడీగా నాకు 'మాస్టర్' సినిమాలో అవకాశం వచ్చినప్పుడు త్రిష స్పెషల్ మెసేజ్ పంపారు. 'బేబీ నీకు ఇంత పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. అలా అభినందించడానికి పెద్ద మనసు కావాలి" అంటూ త్రిషపై మాళవిక ప్రశంసలు కురిపించారు. కెరీర్ కీలక మలుపు తిరిగే సమయంలోనూ త్రిష ఇచ్చిన ప్రోత్సాహం తనకెంతో ప్రత్యేకమని అన్నారు. 2021లో విడుదలైన 'మాస్టర్' విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఇక మాళవిక నటించిన తాజా చిత్రం 'సర్దార్ 2' సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది

# 'రణబాలి' టార్గెట్ మొదలైంది.. టీజర్ అప్‌డేట్ వచ్చేసింది



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి' . టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ దసరా కానుకగా అక్టోబరు 16న విడుదల కానుంది.ఈ క్రమంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలు షురూ చేసింది. ఇందులో భాగంగా సెప్టెంబరు 9న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. మూవీ విడుదలకు దాదాపు నెల రోజుల సమయం ఉండటంతో సినిమాను ప్రేక్షకులకు మరింత చేరువ చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే టీజర్‌తో ఈ కార్యక్రమాలను మొదలు పెట్టనుంది. ఇది 1854 – 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోన్న సినిమా. విజయ్ ఇందులో ఓ యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఈ చిత్రానికి అజయ్ – అతుల్ సంగీతం అందిస్తున్నారు.

# అటు రామాయణ.. ఇటు మహాశక్తి.. దీపావళి సందడి డబుల్!



ఈసారి దీపావళికి బాక్సాఫీసు సందడి రెట్టింపు కానుంది. భారీస్థాయిలో తెరకెక్కుతున్న పాన్ఇండియా చిత్రం 'రామాయణ'ను దీపావళి సందర్భంగా నవంబరు 6న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. రాముడిగా రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయిపల్లవి, రావణాసురుడిగా యశ్ నటిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పుడు మరో ఆసక్తికరమైన చిత్రం వెలుగుల పండగ సందర్భంగా బరిలో నిలిచేందుకు సిద్ధమవుతోంది. అది ఇంకేదో కాదు.. ప్రముఖ నటి నయనతార మరోసారి అమ్మవారి పాత్రలో నటిస్తున్న 'మూకుత్తి అమ్మన్ 2' . తెలుగులో 'మహాశక్తి' టైటిల్‌ను ఫిక్స్ చేశారు.

ఈ చిత్రంలో రెజీనా, దునియా విజయ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ దర్శకుడు సుందర్.సి తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆయన కూడా ఓ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఆరేళ్ల క్రితం ఆర్జే బాలాజీ దర్శకత్వంలో వచ్చిన 'మూకుత్తి అమ్మన్', తెలుగులో 'అమ్మోరు తల్లి' పేరుతో విడుదలై విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో మూకుత్తి అమ్మన్ 2'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాను దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అందుకనుగుణంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన నయతార ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన వచ్చింది.

# కమల్‌కి 'భారతీయుడు'లా... నాకు 'సర్దార్' : కార్తి



తన సినీ కెరీర్‌లో చాలా ముఖ్యమైన సినిమా 'సర్దార్ 2' అన్నారు కథా నాయకుడు కార్తి. కమల్‌హాసన్‌కి 'భారతీయుడు' ఎలాగో.. తనకలా 'సర్దార్' సినిమా అని చెప్పారు. కార్తి.. దర్శకుడు పీఎస్ మిత్రన్ కలయికలో విజయవంతమైన 'సర్దార్'కి కొనసాగింపుగా రూపొందిన చిత్రమే 'సర్దార్ 2'. ఎస్.లక్ష్మణ్ కుమార్ నిర్మించారు. ఆషికా రంగనాథ్, మాళవిక మోహనన్ కథానాయికలు. ఎస్‌జే సూర్య కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈ నెల 10న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. హీరో అడివి శేష్, దర్శకుడు బోయపాటి శ్రీను ముఖ్య అతిథులుగా హాజరయ్యారు."ప్రస్తుతం తెలుగు చిత్రసీమ చాలా అద్భుతంగా ఉంది. విడుదలైన ప్రతి సినిమా విజయవంతమవుతూ.. ప్రేక్షకుల్ని అలరిస్తోంది. ఇలాంటి టైమ్‌లో 'సర్దార్ 2' వస్తోంది. ఇది కూడా అదే కోవలో ఓ అద్భుతమైన చిత్రమవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అన్నారు బోయపాటి శ్రీను. కథానాయకుడు కార్తి మాట్లాడుతూ.. "సర్దార్' లాంటి ఓ స్పై పాత్ర దొరకడం నా అదృష్టం. తొలి పార్ట్ చేసినప్పుడే నాకు ఓ మంచి ఫీలింగ్ వచ్చింది. ఇలాంటి గూఢచారులకు ఎలాంటి గుర్తింపు, గౌరవం ఉండదు. కానీ, వాళ్ల పనిని అత్యంత కచ్చితత్వంతో చేస్తారు. ఈ చిత్రంలో మహిళా శక్తిని చూస్తారు. దీంట్లో డ్యాన్స్ లేదు. హీరోయిన్లు ఇద్దరూ యాక్షన్ మాత్రమే చేస్తారు" అన్నారు. ఈ కార్యక్రమంలో ఆషికా రంగనాథ్, మాళవిక మోహనన్, వై.రవిశంకర్, సాయిబాబా, బీవీఎస్ఎన్ ప్రసాద్, అభిషేక్, ఎస్.నాగవంశీ, కల్యాణ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**సూపర్ హీరో కథలో..**

కార్తి – కల్యాణ్ శంకర్ కలయికలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇది ఓ సూపర్ హీరో ఎలిమెంట్‌తో కూడిన చిత్రమని నిర్మాత సూర్యదేవర నాగవంశీ 'సర్దార్ 2' వేడుకలో వెల్లడించారు.

# దేవత్‌పల్లి గేటు వద్ద ఆర్టీసీ బస్‌స్టాప్‌కు సాంక్షన్

## ప్రజలు విద్యార్థులు ఉపాధ్యాయులు కార్మికుల ఇబ్బందులకు పరిష్కారం




**జన సముద్రం న్యూస్ నాంపల్లి, నల్లగొండ సెప్టెంబర్ 8:**
మునుగోడు నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్‌నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై ఉన్న దేవత్‌పల్లి గేటు వద్ద ఆర్టీసీ బస్‌స్టాప్‌కు సాంక్షన్ మంజూరైంది. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.దేవత్‌పల్లి గేటు పరిసర ప్రాంతాల్లో గురుకుల పాఠశాలతో పాటు రైస్ మిల్లులు నాలుగు గ్రామాలు ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు కార్మికులు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు రాకపోకలు సాగిస్తున్నారు.మల్లెపల్లి దేవరకొండ నాంపల్లి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు బస్‌స్టాప్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి.బస్సులు నిలవకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తూ అధిక చార్జీలు చెల్లించాల్సి వచ్చేదని ఈ సమస్యను ప్రజాప్రతినిధులు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న ఆర్టీసీ అధికారులు దేవత్‌పల్లి గేటు వద్ద బస్‌స్టాప్‌కు సాంక్షన్ మంజూరు చేశారు.బస్‌స్టాప్ మంజూరుకు సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి, ఆర్టీసీ అధికారులకు దేవత్‌పల్లి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల చిరకాల సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో దేవత్‌పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ముదిగొండ ఏసు, ఉప సర్పంచ్ జక్కుల సత్యనారాయణ కుందారపు రమేష్. (మాజీ సర్పంచ్) ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి సైదాచారి యాదగిరి. కుందారపు వెంకటయ్య . కొండల్.పోలేపాక వెంకటయ్య. రాఘవచారి. నరసింహ.రాములు.కొండల్ యాదవ్. ధనంజి. యదయ్య. యాలాద్రి చంద్రమౌళి వివిధ పార్టీల నాయకులు వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి అవమానం

## తాత మధుపై కఠిన చర్యలు తీసుకోవాలి: ముదిగొండ సైదయ్య




**జన సముద్రం న్యూస్ । నాంపల్లి । సెప్టెంబర్ 8:**
శాసనసభ స్పీకర్ స్థానంలో ఉన్న దళిత నేతపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మునుగోడు నియోజకవర్గం నాంపల్లి మండల టీపీసీసీ సోషల్ మీడియా ఇంచార్జి ముదిగొండ సైదయ్య అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత బాధ్యతతో కూడుకున్నదని ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడుతూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.దళిత నాయకుడిపై ఈ తరహా వ్యాఖ్యలు చేయడం సమాజానికి తప్పుడు సంకేతాలను ఇస్తుందని సైదయ్య అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ పదవులను ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు.శాసనమండలి గౌరవాన్ని కాపాడేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆయనను వెంటనే శాసనమండలి నుంచి సస్పెండ్ చేయాలని ముదిగొండ సైదయ్య డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు శాసనసభ వ్యవస్థ తగిన విధంగా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# చిట్టమూరు లో మరియు చుట్టుపక్క గ్రామాల్లో వేళ పాలలేని విద్యుత్ కోతలు.




**నెల్లూరు, సెప్టెంబర్ 8, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
ఉమ్మడి నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట డివిజన్ పరిధిలో ని చిట్టమూరు మండలం లో మరియు చుట్టుపక్క గ్రామాల్లో రాత్రి సమయంలో వేళ పాలలేని విద్యుత్ కోతలు వలన ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.చిట్టమూరు మండలం కోత వేటు దూరం లో నున్న కొత్త గుంట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలు మరియు గ్రామాల్లో ఉన్న ప్రజలు ముఖ్యం గా రాత్రి సమయంలో గ్రామాల్లో విద్యుత్ కోత వలన వీధిలైట్లు లేకపోవడం వలన విష సర్పాలు వీధుల్లో సంచారిస్తుండం వలనఏ నిమషం లో ఏమి జరుగు తుందో అనే భయం గుప్పెట్లో పెట్టు కొని గ్రామాల్లో ప్రజలుఉన్నారు. రాత్రి సమయంలో కరెంటు అంతరాయం వలన పసిబిడ్డలు గర్భిణీలు చదువుకునే పిల్లలు హాస్టల్లో ఉన్న విద్యార్థులు కరెంటు వలన చాలా ఇబ్బందికరంగా ఉందని బాధపడుతున్నారు.
ముఖ్యంగా భోజనం చేసే సమయంలో కరెంటు లేక అల్లాడిపోతున్న ప్రజలు అసలు ఎందుకు ఈ కరెంటు కోతలు జరుగుతున్నాయి కనీసం సమాచారం కూడా తెలపని విద్యుత్ శాఖఅధికారులు. విద్యుత్ కోతలతో అంధకారంలో సబ్ స్టేషన్ పరిధిలో ని చుట్టుపక్క గ్రామాలు.రోజుకో సమయంలో విద్యుత్ కోతలు విధిస్తున్న విద్యుత్తు అధికారులు ముందస్తు సమాచారం లేకుండా ప్రజల ను ఇబ్బంది పే డుతున్న రని అసలు ఎందుకు కరెంటు కోత ఇది ఏమైనా వేసవికాలమా అంటున్న ప్రజలు. కరెంటు కోతల వలన సమయపాలనపై స్పష్టత లేక కొత్త గుంట సబ్ స్టేషన్ పరిధిలో ని ప్రజలు మరియు చుట్టుపక్క గ్రామ ప్రజల్లో అయోమయం నెలకోని ఉంది.రాత్రి సమయంలో కరెంటు కోతలతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
గ్రామాల్లో కన్నెత్తి చూడని సంబంధిత లైన్ మాన్ లు విద్యుత్ శాఖ అధికారులు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ కోతల మీద దృష్టి సారించలాని కొత్త గుంట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ని ప్రజలు మరియు చుట్టుపక్క గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

# అన్నా క్యాంటీన్‌లో పొంగూరు షరణి సందడి

- **సామాన్యులతో కలిసి భోజనం చేసిన మంత్రి నారాయణ కుమార్తె**
- **5 రూపాయలకే భోజనం నాణ్యతపై పొంగూరు షరణి ప్రశంసలు**
- **పేదలకు కొండంత అండ.**
- **అన్నా క్యాంటీన్ భోజనం బాగుంది:**
- **షరణి**



**నెల్లూరు, సెప్టెంబర్ 8, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
నెల్లూరు నగరంలోని తడికలబజార్ సెంటర్‌లో ఉన్న అన్నా క్యాంటీన్‌ను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగురు నారాయణ కుమార్తె పొంగూరు షరణి ప్రత్యేకంగా సందర్శించారు. ముందుగా కౌంటర్ దగ్గర 5 రూపాయల టికెట్ టోకెన్ తీసుకొని, వరుస క్రమంలో నిలబడి భోజనం తీసుకున్నారు. క్యాంటీన్‌లో అందిస్తున్న భోజన నాణ్యతను, రుచిని ఆమె స్వయంగా తిని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు చాలా బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, ఐదు రూపాయలకే కడుపునిండా పౌష్టికాహారం లభించడం పేదలకు, సామాన్యులకు కొండంత అండగా నిలుస్తుందని హర్షం వ్యక్తం చేశారు.
అనంతరం అక్కడికి వచ్చిన సామాన్య ప్రజలతో కలిసి షరణి భోజనం చేశారు. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యురాలు తమతో కలిసి భోజనం చేయడమే కాకుండా, తమ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకోవడంతో పేద ప్రజలు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి పేదవాడి ఆకలి తీర్చాలనే ఉన్నతాశయంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్లు ఎందరో దినసరి కూలీలకు ప్రాణధారగా మారాయని అక్కడ భోజనం చేస్తున్న స్థానికులు సంతోషంగా కొనియాడారు.

# వల్లభాపూర్ ఉన్నత పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

## అక్షరాస్యత దేశ అభివృద్ధికి పునాది: హెచ్‌ఎం సుదర్శన్ రెడ్డి







**ఎల్కతుర్తి సెప్టెంబర్ 8,(జనసముద్రం)**
హనుమకొండజిల్లా ఎల్కతుర్తి మండలంవల్లభాపూర్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.
కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి, విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. అక్షరాస్యతప్రాముఖ్యతనుప్రజలకు తెలియజేయడం, ప్రతి ఒక్కరికీ విద్య అందేలా ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమన్నారు.అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడం, లెక్కించడం మాత్రమే కాదని, నేటి ఆధునిక సమాజంలో సమాచారాన్ని అర్థం చేసుకోవడం, సరైన నిర్ణయాలుతీసుకోవడం,సమస్యలనుపరిష్కరించడం, డిజిటల్ సాధనాలను బాధ్యతగా వినియోగించడం, హక్కులుబాధ్యతలను తెలుసుకోవడం కూడా అక్షరాస్యతలో భాగమని వివరించారు."ఒక వ్యక్తి అక్షరాస్యుడైతే ఒక కుటుంబం మారుతుంది.. ఒక కుటుంబం మారితే సమాజం మారుతుంది.. సమాజం మారితే దేశం అభివృద్ధి చెందుతుంది" అని పేర్కొంటూ అక్షరాస్యత దేశ అభివృద్ధికి పునాది అని అన్నారు.
దేశంలో అక్షరాస్యతను పెంపొందించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.జాతీయ అక్షరాస్యత మిషన్, సాక్షర్ భారత్ మిషన్, పఢ్నా లిఖ్నా అభియాన్, ఉల్లాస్‌నవ భారత్ సాక్షరత కార్యక్రమం, పిల్లల్లో ప్రాథమిక చదవడం, రాయడం, సంఖ్యాజ్ఞానాన్ని పెంపొందించేందుకు నిపుణ్ భారత్ మిషన్ వంటి కార్యక్రమాలుకొనసాగుతున్నాయనివివరించారు.
అయితే ప్రభుత్వ కార్యక్రమాలతో మాత్రమే అక్షరాస్యతలక్ష్యాన్నిసాధించలేమని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సమాజం మొత్తం కలిసి పనిచేయాలని కోరారు.విద్యార్థులు తాము చదువుకోవడంతో పాటు చదువుకు దూరంగా ఉన్నవారిని ప్రోత్సహించాలని సూచించారు.నేను చదువుతాను నా కుటుంబాన్ని చదివిస్తాను నా సమాజాన్ని అక్షరాస్యంగా మారుస్తాను" అనే సంకల్పాన్ని ప్రతి విద్యార్థి తీసుకోవాలని పిలుపునిచ్చారు.తల్లిదండ్రులు పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపడంతో పాటు ఇంటి వద్ద చదువునుపరిశీలించి,ఉపాధ్యాయులతోసమన్వయం చేసుకుంటూపిల్లలనుప్రోత్సహించాలనిసూచించారు.
"అక్షరం ఒక దీపం.. విద్య ఒక వెలుగు..
అక్షరాస్యత ఒక శక్తి.. ఆ శక్తితోనే మన దేశం అభివృద్ధి చెందుతుంది" అని ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి అన్నారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట స్వామి, కల్యాణి,రమాదేవి,శోభారాణితదితరులుపాల్గొన్నారు.

# చర్చి నిర్మాణ పనులను అడ్డుకున్న బిజెపి నాయకులుగ్రామస్తులు

## అధికారులకు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు, గ్రామస్థులు







**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్ సెప్టెంబరు 8:**
ఒంటిమిట్ట మండలం సాలాబాదు పంచాయతీ పరిధిలోని సాలాబాదు గ్రామంలో జరుగుతున్న చర్చి నిర్మాణ పనులను మంగళవారం స్థానికులు, బీజేపీ నాయకులు అడ్డుకున్నారు.
నిర్మాణానికి సంబంధించి అనుమతులు, నిబంధనలపై సందేహాలు ఉన్న నేపథ్యంలో అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు.
ఈ విషయమై తహసీల్దార్ (ఎమ్మార్వో)కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా, ఆయన వెంటనే స్పందించి నిర్మాణ పనులను నిలిపివేయించినట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీవోకు కూడా ఫిర్యాదు అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను పరిశీలించి, అక్రమంగా ఉన్నట్లయితే పూర్తిగా తొలగించే చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ గౌరీకి కూడా వినతిపత్రం అందజేసి, గ్రామంలో నిర్మాణాలపై సమగ్రంగా విచారణ జరిపి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రుద్రరాజు భాను ప్రకాష్‌రాజు, కండ కార్యవాహ వేణుగోపాల్‌రాజు, కండసహకార్యవాహక్ మామిడి వెంకటరమణారెడ్డి, నాగమల్లేశ్వర్‌రెడ్డి, అరవ వెంకటసుబ్బారెడ్డి, బాలరాజు శివరాజు, ఉమ్మడి జనార్దన్‌రెడ్డి, ఎంపీ శేషారెడ్డి, ఎంపీ గంగిరెడ్డి, ఎంపీ సుబ్బారెడ్డి, అరవ శ్రీనివాసులురెడ్డి, చెరువు సంఘం అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు పాటూరు గంగిరెడ్డితో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామంలో ఎలాంటి నిర్మాణమైనా సంబంధిత అనుమతులు, నిబంధనల మేరకు మాత్రమే చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

# వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు

## గణేష్ ఘాట్, పెన్నా బ్రిడ్జి వద్ద నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల





**నెల్లూరు, సెప్టెంబర్ 08: జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
వినాయక చవితి ఉత్సవాలను జిల్లాలో శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు.
మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లు, భద్రతా చర్యలు, నిమజ్జన కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాలు, 18వ తేదీన ఇరుగాలమ్మ గుడి సమీపంలోని గణేష్ ఘాట్, రంగనాథ స్వామి గుడి సమీపంలోని పెన్నా బ్రిడ్జి వద్ద నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.
వినాయక విగ్రహాల ఏర్పాటు కోసం పోలీసు, రెవెన్యూ, విద్యుత్, ట్రాఫిక్, మున్సిపల్ తదితర శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. గణేష్ మండపాలకు అనుమతులు మంజూరు చేసే సమయంలో నిబంధనలు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చూడాలని ఆదేశించారు. సింగిల్ విండో విధానంలో అనుమతులను వేగంగా మంజూరు చేయాలని పోలీసులకు సూచించారు.
విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, మండపాల వద్ద నాణ్యమైన విద్యుత్ వైర్లు, సురక్షిత విద్యుత్ కనెక్షన్లు ఉండేలా చూడాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, గజ ఈతగాళ్లు, పోలీసు సిబ్బంది, వైద్య బృందాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.
నిమజ్జన ప్రాంతాల్లో పూడికను తొలగించి, నీటి లోతును గుర్తించి, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.
ఊరేగింపు మార్గాల్లో రోడ్లపై ఉన్న గుంతలు, విద్యుత్ తీగలు, ఇతర అడ్డంకులను ముందుగానే గుర్తించి తొలగించాలని తెలిపారు. ఉత్సవాల్లో డీజేలు, మైకుల వినియోగం, ఊరేగింపుల సమయం తదితర అంశాల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, ట్రాఫిక్, ఫైర్, వైద్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, పార్కింగ్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు.
జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. అధికారులు, భక్తులు, ప్రజలు సమన్వయంతో సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.
ఈ సమావేశంలో డిఆర్ఓ విజయ్ కుమార్, ఏఎస్పీ సౌజన్య, ఆర్డీవో అనూష, వివిధ శాఖల అధికారులు, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ కి ఎంపికైన అభ్యర్థులపై వైసీపీ పార్టీ గొడ్డలి పర్వం ఇంకా ఆగడం లేదు : శివారెడ్డి

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా,**
**మాచర్ల నియోజకవర్గం, సెప్టెంబర్ 8;**
ఏపీ రాష్ట్రం లో మెగా డీఎస్సీ కి ఎంపికైన అభ్యర్థులపై వైసీపీ పార్టీ గొడ్డలి పర్వం ఇంకా ఆగడం లేదని అమరావతి పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి మండిపడ్డారు. వైసీపీ పార్టీ 5సం.లు అధికారం లో ఉండి, ఒక్క టీచరు పోస్ట్ కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను ముంచి, పైగా ఏపీపీఎస్సీ కి డీఎస్సీ కి తేడా తెలియక డీఎస్సీ నియామకాలపై కోర్టుల్లో 300 కేసులువేయించిభంగపడ్డారని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారం లోకి వచ్చిన కేవలం 148 రోజుల్లోనే 16,347 టీచర్స్ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశారని కొనియాడారు. కుట్రలతో యువత భవిష్యత్తును పాడు చేయాలని చూస్తున్న సైకో వైసీపీ పార్టీకి రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని, ఇది మాత్రం ఖాయం అని శివారెడ్డి స్పష్టం చేశారు.



**నవులూరి శివారెడ్డి,**
**అమరావతి పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాచర్ల,**
**సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి.**

## ఇంటి నిర్మాణం కోసం 10 వేల ఆర్ధిక సహాయం

### రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 8**

వెల్దండ మండల :-పరిధిలోని రాచుర్ గ్రామానికి చెందిన తెలగమళ్ళ అనిత రవికుమార్ కు మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి 10 వేల రూపాయల ఆర్ధిక సహాయాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపి రామ్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ గౌడ్,మాజీ వైస్ ఎంపీపి లు గోవర్ధన్,అనిల్ కుమార్,మాజీ ఎంపీటిసి గుత్తి వెంకటయ్య,మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి,నాయకులు నిరంజన్,లింగం,ప్రభాకర్,రాజు,రాజేష్,వెంకటయ్య,అం



జి మాస్టార్,ప్రవీణ్, గణేష్,నరేష్, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల్లో.. "అక్రమ లేఅవుట్లకు".. పర్మిషన్ ఎవరిచ్చారు:- కలెక్టర్ సారు..?

**- అక్రమ లేఅవుట్లకు, ఇరిగేషన్ కాలవని డిస్టర్బ్ చేసి వంతెనలు కట్టడానికి పర్మిషన్లు ఎవరు ఇచ్చారు సార్..??**

**- ప్రభుత్వ భూములు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ నోటీసులపై సమగ్ర విచారణ చేపట్టాలి:- ప్రజా సంఘాల డిమాండ్..!**

**జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 9 అనంతరాజుపేట (కడప):**


కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా), పంచాయతీ రాజ్ శాఖల అధికారులు అనంతరాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, అక్రమ లేఅవుట్లకు క్రమబద్ధీకరణ నోటీసులుఇవ్వడంపైతీవ్రఅభ్యంతరాలువ్యక్తమవుతున్నాయి.

తిరుపతి జిల్లా రైల్వే కోడూర్ నియోజకవర్గంలోని అనంతరాజుపేట గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్లు 1221, 1231, 1230, 1227, 1228, 1229 లలో ఎటువంటి అనుమతులు లేకుండా వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్‌కు సంబంధించి ఫీజు చెల్లించి రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్) చేసుకోవాలని అధికారులు నోటీసులు జారీ చేశారు... అయితే, ఈ ప్రక్రియలో అధికారులు ప్రాథమిక నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**ప్రధాన సమస్యలు:-**

ప్రభుత్వ భూముల చేర్పు.. సదరు వెంచర్‌లో ఉన్న సర్వే నంబర్లు 1227, 1229 పూర్తిగా ప్రభుత్వ భూములు...!! ప్రభుత్వ భూముల్లో వెంచర్ ఎలా వేస్తారు....? వాటికి క్రమబద్ధీకరణ నోటీసులు ఎలా ఇస్తారు...?

అప్రోచ్ రోడ్డు లేకపోవడం..!! ఈ వెంచర్‌కు ఎటువంటి అధికారిక అప్రోచ్ రోడ్డు లేదు...??



రహదారి సదుపాయం లేని స్థలాలకు అనుమతులు లేదా రెగ్యులరైజేషన్ ప్రతిపాదనలు చేయడం చట్ట విరుద్ధం.

ల్యాండ్ కన్వర్షన్ (ఎన్ ఎ) జరగకపోవడం...!! వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చే 'ల్యాండ్ కన్వర్షన్' (ఎం ఏ ఎల్ ఏ) ప్రక్రియ పూర్తికాకుండానే లేఅవుట్‌ను ఎలా క్రమబద్ధీకరిస్తారు...? అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించి వేసిన ఈ వెంచర్‌పై అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటి...?

అక్రమ లేఅవుట్‌ను రద్దు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి... ఫీజులు చెల్లించాలని నోటీసులు ఇవ్వడం వెనుక ఉన్న అధికారుల పాత్రపై ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలి. ఈ అక్రమ వెంచర్‌ను వెంటనే రద్దు చేసి, ప్రభుత్వ భూములను కాపాడాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలుడిమాండ్ చేస్తున్నాయి...

## గ్రామస్తులతో మమేకమైన నరసాపురం ఎమ్మెల్యే

### - పలు వార్డుల్లో పర్యటించిన బొమ్మిడి నాయకర్





**నరసాపురం సెప్టెంబర్ 8 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**

నరసాపురం పట్టణంలో మంగళవారం 30, 29 వార్డులలో రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా వార్డు వాసులతో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న మౌలిక వసతుల లేమిని, ఇతర పౌర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల విజ్ఞప్తుల పట్ల వేగంగా స్పందించిన ఆయన.. అక్కడికక్కడే ఆయా డిపార్ట్‌మెంట్ల ఉన్నతాధికారులతో సమీక్షించారు. పాలనా పరమైన అలసత్వానికి తావులేకుండా, సామాన్యుల ఇబ్బందులను



యుద్ధప్రాతిపదికన పరిష్కరించే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు!

### తనికీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్



**నరసాపురం సెప్టెంబర్ 8 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**

నరసాపురం పట్టణంలోని 10 నుండి 17వ వార్డుల పరిధిలోని 5, 6, 7, 8, 10 సచివాలయాలను ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, రోజువారీ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ముఖ్యంగా సామాజిక పింఛన్ల ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి. అలాగే కొత్తగా పింఛన్‌కు అర్హులైన వారి దరఖాస్తుల ప్రక్రియకు ఈ నెల 16వ తేదీతో గడువు ముగియనున్నందున, అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు



చేసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ప్రతి దరఖాస్తును సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే లేదా ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని సచివాలయ సిబ్బందికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఈ తనిఖీలు నరసాపురం నియోజకవర్గంలో కొనసాగుతాయని తెలిపారు.

## మెగా డీఎస్సీ అభ్యర్థులపై 'గొడ్డలి' పర్వం

### టీడీపీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**జన సముద్రం న్యూస్ ,**
**పల్నాడు జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 08**

మెగా డీఎస్సీ అభ్యర్థులపై వైసీపీ 'గొడ్డలి' పర్వం ఇంకా ఆగడం లేదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అనేది శవ రాజకీయాల పునాదులపై పుట్టిన నీచ సంస్కృతి గల పార్టీ అని విమర్శించారు. కన్న తండ్రి మరణిస్తే ఏ కొడుకైనా శోకసంద్రంలో మునిగిపోతాడని, జగన్ మాత్రం తాను సీఎం కావాలనే యావతో సంతకాల సేకరణలో బిజీగా గడిపిన స్వార్థపరుడని దుయ్యబట్టారు.

ఎన్నికల ముందు కోడికత్తి డ్రామాలు ఆడి, సొంత బాబాయ్‌ని గొడ్డలితో చంపించి నారాసుర రక్తచరిత్ర అంటూ సానుభూతి పొంది గద్దెనెక్కిన చరిత్ర జగన్‌ది కాదా అని నిలదీశారు. బాబాయ్‌కి గొడ్డలిపోటు, కన్న తల్లికి, తోడబుట్టిన చెల్లికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తికి రాష్ట్రాన్ని పాలించే నైతిక అర్హత లేదన్నారు.'ఒక్క అవకాశం' అంటూ అధికారంలోకి వచ్చి 150కి పైగా ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి అని బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా




భర్తీ చేయకుండా ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోగులను నట్టేట ముంచారని మండిపడ్డారు. యువతను గంజాయి, డ్రగ్స్ మత్తులోకి నెట్టి అన్నపూర్ణ లాంటి రాష్ట్రాన్ని నాశనం చేశారని, నాసిరకం కల్తీ మద్యంతో ఏకంగా 30 వేల మందికి పైగా ప్రాణాలు బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గురువులను మద్యం షాపుల వద్ద కాపలా పెట్టి అవమానించిన వైసీపీ నేతలు, నేడు కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీపై నిస్సిగ్గుగా తప్పుడు ప్రచారాలు చేయడం దుర్మార్గమన్నారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని జగన్, నియామకాలను అడ్డుకోవడానికి ఏకంగా 300 పిటిషన్లు వేయిస్తే దేశ సర్వోన్నత న్యాయస్థానాలు వాటన్నింటినీ కొట్టివేశాయని గుర్తుచేశారు.యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు వైసీపీ కుట్రలన్నింటినీ ఛేదించారని కొనియాడారు. కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసిన ఘనత లోకేష్‌కే దక్కుతుందన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారి స్ఫూర్తితో యువత ఎంతో శ్రమించి సాధించిన కొలువులను చూసి ఓర్వలేక వైసీపీ రాక్షసానందం పొందుతోందని విమర్శించారు. ప్రజలు ప్రశాంతంగా జీవిస్తుంటే చూడలేని జగన్, కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి శవాల గుట్టలపై రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ, ఉత్తరాంధ్ర కాలువ, పోలవరం సహా 36 కీలక ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి, మంత్రులకు నిర్దిష్ట లక్ష్యాలు నిర్దేశిస్తూ 'సూపర్ సిక్స్' పథకాలతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న చంద్రబాబు గారి కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యార్థులకు ఆట సామగ్రి పంపిణీ చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికర డైరెక్టర్ కొవ్వాసు.జగదీశ్వరి

**జనసముద్రం న్యూస్ కొయ్యలగూడెం మండల రిపోర్టర్**
**ఈ.మనోహర్, సెప్టెంబర్ 08,**

ఏలూరు జిల్లా, పోలవరం నియోజకవర్గం, వేలేరుపాడు మండలం కన్నాయిగుట్ట ఫ్రీ ప్రైమరీ ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని క్రీడల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తన నిధులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికర డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పాల్గొని విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు, ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను




పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం, అవసరమైన క్రీడా సామగ్రి అందిస్తే వారు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని పేర్కొన్నారు. ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని, యువత క్రీడల్లో ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు, క్రీడా సామగ్రి అందడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు అవసరమైన సామగ్రిని అందించి క్రీడల్లో ప్రోత్సహిస్తున్న కొవ్వాసు జగదీశ్వరి సేవలను వారు అభినందించారు.

ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకురాలు మడకం లక్ష్మీ ఉప్పాటి వెంకట రావు P4 సభ్యులు జగదీష్, సాయి రాజేంద్ర, బుజ్జి దొర శ్రీను దొర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## ఈ నెల 16న లోకేష్ చేతుల మీదుగా పాఠశాలల ప్రారంభం







**- పొంగూరు షరణి.**
**- వి ఆర్ స్కూల్ కంటే మెరుగ్గా డి ఎస్ ఆర్, ఆర్ ఎస్ ఆర్ లను తీర్చిదిద్దుతాం**
**- లోకేష్ రాకతో నెల్లూరు బడులకు కొత్త కళ.**
**- పనుల పరిశీలనలో వేగవంతం**
**- నారాయణ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.**
**- లోకేష్ ప్రారంభోత్సవానికి డి ఎస్ ఆర్, ఆర్ ఎస్ ఆర్ బడులు సిద్ధం.**
**- షరణి**

**నెల్లూరు, సెప్టెంబర్ 8, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

నెల్లూరులోని మూలపేట డీఎస్ఆర్, స్టోన్ హౌ ఆర్ఎస్ఆర్ పాఠశాలలను ప్రారంభించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 16వ తేదీ రానున్న నేపథ్యంలో, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె పొంగూరు షరణి మంగళవారం ఈ పాఠశాలలను సందర్శించారు. పాఠశాల మైదానాలు, తరగతి గదులను పరిశీలించిన ఆమె, చదువుకుంటున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.

విద్యార్థుల విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజన నాణ్యతతో పాటు ఎన్సిసి విద్యార్థులకు అందుతున్న శిక్షణ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె స్వయంగా పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు.

అనంతరం షరణి మాట్లాడుతూ,గతంలో వి ఆర్ పాఠశాలను ఏ విధంగానైతే డెవలప్ చేశామో, అంతకంటే మెరుగ్గా డిఎస్ఆర్, ఆర్ఎస్ఆర్ పాఠశాలలను రినోవేట్ చేయాలని మా నాన్నగారు బాధ్యత అప్పగించారని తెలిపారు. లోకేష్ వచ్చే లోపే గ్రౌండ్ వర్క్ నుంచి క్లాస్ రూమ్‌ల వరకు అన్ని పనులను వేగవంతం చేస్తున్నామని, మౌలిక సదుపాయాలతో పాటు టీచర్ క్వాలిటీ, అకాడమిక్స్ పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. నెల్లూరు ప్రజలు నారాయణ పై ఉంచిన నమ్మకాన్ని ఖచ్చితంగా నిలబెట్టుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 39,40డివిజన్ల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ అన్నంగి ప్రసాద్,జనరల్ సెక్రటరీ మధుసూదన్,వైస్ ప్రెసిడెంట్ మురళీ మోహన్, నాయకులుదీనదయాల్,మురళీ, కృష్ణ సింగ్, విజయలక్ష్మి, రాజేష్, 8,10వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమల నాయుడు,కో-క్లస్టర్ ఇన్‌చార్జ్ హేమంత్, యూనిట్ ఇంచార్జి వెంకట్రావు,వైస్ ప్రెసిడెంట్మల్లికార్జున,గయాజ్,శ్రీమన్నారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 7 రోజుల పసిపాప చికిత్సకు రూ.3.51 లక్షల ఆర్థిక సాయం

### కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రత్యేక చొరవ

**నెల్లూరు, సెప్టెంబర్ 8, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్ ) అండగా నిలుస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. విజయవాడ, తాడేపల్లిలో విడవలూరు మండలం, ఊటుకూరు పంచాయతీ, కంచరపాలెం గ్రామానికి చెందిన పామర్తి రూప అనే మహిళ కుమార్తె 7 రోజుల పసిపాప చికిత్స కోసం రూ.3,51,847 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓసీ ( లెటర్ ఆఫ్ క్రెడిట్ )ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్వయంగా అందజేశారు.

పసిపాప తక్కువ బరువుతో, పూర్తిస్థాయి ఎదుగుదల లేక తీవ్ర ఆరోగ్య సమస్యతో బాధపడుతోంది. పాపను కాపాడుకునేందుకు సుమారు 2 నుంచి 3 నెలల పాటు ఆస్పత్రిలోని ఐసీయూ (ఇన్క్యుబేటర్/బాక్స్)లో ఉంచి చికిత్స అందించాల్సి ఉందని వైద్యులు తెలిపారు. నెల్లూరులోని కిమ్స్ ( కిమ్స్) ఆస్పత్రిలో చికిత్స



పొందుతున్న ఈ చిన్నారికి వైద్య ఖర్చులు భారీగా కానుండటంతో, అంత మొత్తం భరించే స్థోమత లేక కుటుంబ సభ్యులు కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ని ఆశ్రయించారు.

కుటుంబ పరిస్థితిని, ఆ పసికందు ఆరోగ్య తీవ్రతను చూసి తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే , ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి కార్యాలయానికి సిఫార్సు చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం, పాప చికిత్స కోసం రూ.3,51,847 విలువైన సీఎంఆర్ఎఫ్ లెటర్ ఆఫ్ క్రెడిట్ ( ఎల్ వో సి )ను మంజూరు చేసింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని నిరుపేదలకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సకు దూరమవుతున్న అర్హులైన పేదలు ముఖ్యమంత్రి సహాయ నిధిని వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలోనూ తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. తమ 7 రోజుల పాప ప్రాణాలు కాపాడేందుకు అండగా నిలిచి, సీఎంఆర్ఎఫ్ ద్వారా సకాలంలో ఆర్థిక సాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎత్తిపోతల ఆశ్రమ పాఠశాలలో సుజాత మేడం ఘన సన్మానం



జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 08

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సుజాత ని సోమవారం సాయంత్రం ఎత్తిపోతల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వేడుకలో స్థానిక విద్యాధికారి (డిటిడబ్ల్యూ), జిల్లా విద్యాధికారి (ఎంఈఓ), రోటరీ క్లబ్ సభ్యులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు సమక్షంలో ఘనంగా సన్మానించారు. సుజాత ని రాష్ట్రస్థాయి విజయానికి పాఠశాల, సమాజ సేవా రంగంలో చేసిన ప్రతిభకు గుర్తుగా పటాకీలు, గౌరవపత్రం, పుష్పగుచ్ఛం మరియు మెండలితో వేడుకలో అభినందించారు. డిటిడబ్ల్యూ మరియు ఎంఈఓ వారి ఉపాధ్యాతృశైలి, విద్యార్థుల అభివృద్ధికి తెప్పించిన సేవలపై ప్రశంసలు తెలపగా, రోటరీ క్లబ్ స్థానిక సేవా కార్యక్రమాల ద్వారా తీసుకువచ్చిన మద్దతు గురించి తెలిపింది.

దీంతోపాటు జిల్లాలో టీచర్స్ డే సందర్భంగా మరో వేడుకలో జిల్లా అవార్డు పొందిన ప్రముఖ గురువులైన దుర్గాభవాని కి ఉత్తమ హెడ్‌మాస్టర్ అవార్డు, శిరీష కి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందజేసారు. ఈ వేడుకలో కూడా డిటిడబ్ల్యూ, ఎంఈఓ, రోటరీ క్లబ్ సభ్యులు, పాఠశాల శిక్షకులు మరియు స్థానిక ప్రజలు హాజరై శోభను పెంచారు. అవార్డు స్వీకరించిన సందర్భంలో దుర్గాభవాని , శిరీష తమ అనుభవాలను పంచుకున్నారు మరియు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తమను తాము అంకితం చేయాలనే సంకల్పాన్ని వ్యక్తపరిచారు. స్థానిక అధికారుల ప్రకారము, ఇలాంటి గుర్తింపులు మంచి ఉపాధ్యాతృత్వాన్ని ప్రోత్సహించి విద్యా ప్రమాణాలను మెరుగుపరచనున్నాయని తెలిపారు.

# చిన్న గరువు ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలు.. రవాణా

## భీమవరం మండలంలో యథేచ్ఛగా సాగుతున్న మట్టి తరలింపు





భీమవరం సెప్టెంబర్ 8 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్

భీమవరం మండలంలోని చిన్న గరువు ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండా మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా భారీ వాహనాల ద్వారా మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ రహదారులు, భూములు సాగుభూములు దెబ్బతినడంతో పాటు రహదారులపై మట్టి పేరుకుపోయి వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి ఈ వ్యవహారం వెళ్లినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

చిన్న గరువు ప్రాంతంలో జరుగుతున్న మట్టి తవ్వకాలపై మైనింగ్, రెవిన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుమతులు ఉన్నాయా? లేదా? అన్నది తేల్చాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతులు లేని ఎడల శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజా సమస్యలపై మండల తహసిల్దారు ని కలిసిన యనమల మదన్మోహన్






లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 8

ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య భూ సమస్య మరియు ఇతర సమస్యల పై తహసిల్దారు క్రాంతి కుమార్ కి కలిసి తెలియజేసిన మండల అధ్యక్షుడు యనమల మదన్మోహన్ ప్రజలు తాసిల్దార్ ఆఫీస్ కి వచ్చిన వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు అన్ని సమస్యల కంటే రెవెన్యూ సమస్యలు మా దృష్టికి ఎక్కువ వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వెంకట్రామరాజు, చింతకుంటపల్లి బాబు, నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ శ్రీను నాయక్




తూర్పుగోదావరి/ సీతానగరం/ సెప్టెంబర్ 08/ జనసముద్రం న్యూస్:

వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలు ప్రతిష్ఠించే వారు తప్పనిసరిగా ముందస్తు పోలీసు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ శ్రీను నాయక్ మంగళవారం సూచించారు. ఉత్సవ కమిటీలు ఉచిత సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మండపాల ఏర్పాటుకు స్థల యజమాని, పంచాయతీ, ఫైర్, విద్యుత్ శాఖల నిబంధనలు పాటించి అనుమతులు పొందాలని సూచించారు. రహదారులకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. లౌడ్ స్పీకర్లు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని, డీజేలు, మందుగుండు సామగ్రి వినియోగించరాదని స్పష్టం చేశారు. నిమజ్జన సమయంలో మద్యం, మత్తు పదార్థాలు సేవిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా మండల ప్రజలను ఎస్ఐ శ్రీను నాయక్ కోరారు.

# ద్వారకాతిరుమలకు రాష్ట్రంలో రెండో ర్యాంకు

జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా సెప్టెంబర్ 8 ద్వారకా తిరుమల



ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం

రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో భక్తులకు అందిస్తున్న సేవలపై ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది.

దర్శనం, తాగునీరు, ప్రసాదం నాణ్యత, పరిశుభ్రత అంశాలపై వాట్సాప్, ఐవీఆర్ఎస్ ద్వారా గత నెల 4 నుండి ఈ నెల 4 వరకు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో విజయవాడ దుర్గమ్మ ఆలయం మొదటి స్థానంలో నిలవగా, ద్వారకాతిరుమల రెండో స్థానం, శ్రీకాళహస్తి మూడో స్థానం, అన్నవరం నాల్గో స్థానం, కాణిపాకం ఐదో స్థానం, సింహాచలం ఆరో స్థానం, శ్రీశైలం ఏడో స్థానంలో నిలిచాయి. విశేషం ఏమిటంటే, ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబర్‌లో సంతృప్తి శాతం పెరిగింది ద్వారకాతిరుమలలో మాత్రమే. ఆగస్టులో 71.4% ఉన్న సంతృప్తి రేటు ఇప్పుడు 72.1% కి పెరిగింది.

# గ్రామాలభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- రూ 20 కోట్లతో గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చేశాం
- రానున్న రోజుల్లో రూ 100 కోట్లతో గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తాం
- కొణితవాడ గ్రామంలో రూ కోటి 8 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అంజిబాబు







భీమవరం సెప్టెంబర్ 8 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్

భీమవరం నియోజకవర్గంలో కొనితివాడ శివారు గ్రామాలను కూడా సుందరీకరణ చేసి అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలం కొణితవాడ గ్రామంలో సుమారు రూ కోటి 8 లక్షల లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పాఠశాలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అంజిబాబు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ సుమారు రూ 20 కోట్లతో భీమవరం నియోజక వర్గంలోని గ్రామాలకు రోడ్లు వేయడం జరిగిందని, మరో రూ 100 కోట్లతో మరెంత అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందని, అన్ని గ్రామంలోని సీసీ రోడ్లు, డ్రెయిన్లు వేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామ పెద్దలు, అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# మాచర్లలో ఘనంగా జరిగిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

## మాచర్ల పట్టణంలోని కస్తూరిబా పాఠశాలలో కార్యక్రమం నిర్వహణ

జనసముద్రంన్యూస్, మాచర్ల, సెప్టెంబర్ 08;



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

ప్రతి ఒక్కరూ అక్షరాస్యతను సాధించి , తద్వారా జ్ఞానాన్ని సాధించి ఆ జ్ఞానాన్ని సమాజానికి , దేశానికి పంచాలని మాచర్ల మండల న్యాయశాఖ కమిటీ సభ్యులు మరియు పల్నాడు జిల్లా దిశ కమిటీ మెంబర్ మరియు శ్రీ రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవింద రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని, మాచర్ల పట్టణంలోని కస్తూరిబా పాఠశాలలో, మాచర్ల మండలా న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాచర్ల మండల న్యాయశాఖ కమిటీ సభ్యులు, పల్నాడు జిల్లా దిశ కమిటీ మెంబర్ మరియు శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి హాజరై, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. అక్షరమే ఒక ఆయుధమని ఆ ఆయుధాన్ని మీరు ఉపయోగించుకొని ,ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిరక్షరాస్యతను తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే దిశగా అడుగులు వేయాలని గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. వేసవి సెలవులలో, సంక్రాంతి సెలవుల్లో, దసరా సెలవులలో మీరు మీ గ్రామాలకు వెళ్ళినప్పుడు ఎవరైనా నిరక్షరాస్యులు ఉంటే వారిని అక్షరాస్యులు గా చేసే బాధ్యత తీసుకొని మహానుభావులు కలలుగన్న నవభారత నిర్మాణానికి నాంది పలకాలని గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. నిరక్షరాస్యత వల్ల ప్రజలు పడే ఇబ్బందులను గమనించి భావిభారత పౌరులు ఆ ఇబ్బందులు పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా చేసే బాధ్యతను తీసుకోవాలని తెలిపారు. ఒక్క సిరా సుక్క లక్షలాది మెదడులను కదిలించి వేస్తుందని, విద్య వల్ల జ్ఞానం పెరిగి ఆ జ్ఞానాన్ని పదిమందికి పంచే నైపుణ్యం వస్తుందని తద్వారా ప్రపంచం మొత్తం జ్ఞానవంతం అవుతుందని గోవింద రెడ్డి పిలుపునిచ్చారు. సర్వ సమస్య పరిష్కారిణీ విద్య అని, విద్య ద్వారా పరిష్కరించలేని సమస్య ఒకటి కూడా లేదని అన్న స్వామి వివేకానంద సూక్తులను ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి వారికి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రామ్ నాయక్, న్యాయావాది పుల్లారావు, ప్రిన్సిపల్ కవితా మేడం, పిఈటి మేడం తదితరులు పాల్గొన్నారు.

# ఎగువ శోభ పంచాయతీ ప్రజలకు దగ్గరుండి పెన్షన్ దరఖాస్తులు చేయిస్తున్న జనసేన పార్టీ మండల అధ్యక్షులు చిట్టం మురళి

## ఎగువ శోభ సచివాలయంలో ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి

అనంతగిరి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 8



అనంతగిరి మండలం: ఎగువ శోభ పంచాయతీ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తూ, అర్హులైన వారికి పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు అనంతగిరి జనసేన పార్టీ మండల అధ్యక్షులు చిట్టం మురళి. పంచాయతీ ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఆయన నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

ఎగువ శోభ పంచాయతీ పరిధిలోని అర్హులైన పలువురు ప్రజలకు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన చిట్టం మురళి, సంబంధిత సచివాలయ సిబ్బందితో మాట్లాడి దరఖాస్తుల ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, వారికి అవసరమైన సమాచారం అందిస్తూ, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారు.

ఈ సందర్భంగా ఎగువ శోభ పంచాయతీ మాజీ సర్పంచ్ సింహాద్రితో కలిసి ఎగువ శోభ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ (ఖాా) వద్ద పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చూడాలని సచివాలయ సిబ్బందిని కోరారు. చిట్టం మురళి మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడం రాజకీయ నాయకుల ప్రధాన బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పెన్షన్ పొందేందుకు అవసరమైన ప్రక్రియను సులభంగా పూర్తి చేసుకునేలా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

"ప్రజలకు ఏ సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకువస్తే, సాధ్యమైనంత వరకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తాను. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజలకు అండగా నిలబడటమే నా లక్ష్యం" అని చిట్టం మురళి పేర్కొన్నారు.

ఎగువ శోభ పంచాయతీ ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గం చూపించడం ద్వారా జనసేన పార్టీ తరఫున ప్రజా సేవకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎగువ శోభ పంచాయతీ మాజీ సర్పంచ్ సింహాద్రి, కమలాపురం జాంగూడ వార్డు సభ్యులు మధు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చించినాడ వంతెనపై ఆత్మహత్యల నివారణకు ముందడుగు

- 6 అడుగుల ప్రొటెక్షన్ మెష్ నిర్మాణానికి వడివడిగా అడుగులు
- జనసముద్రం పత్రిక వరుస కథనాలతో కదిలిన అధికారి యంత్రాంగం




ఎలమంచిలి సెప్టెంబర్ 8 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్

చించినాడ వంతెనపై ఆత్మహత్యల నివారణకు అధికార యంత్రాంగం ముందడుగు వేసింది. వంతెనపై భద్రతా చర్యలను మరింత పటిష్టం చేసేందుకు సుమారు 6 అడుగుల ఎత్తులో ప్రొటెక్షన్ మెష్ ఏర్పాటు చేయడానికి చర్యలు వేగవంతం చేసినట్లు సమాచారం. చించినాడ వంతెనపై ఇటీవల చోటుచేసుకున్న ఆత్మహత్య ఘటనలు, ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని వంతెనకు రక్షణ వల ఏర్పాటు చేయాలనే డిమాండ్లు వినిపించాయి. ఈ అంశంపై అధికార యంత్రాంగం స్పందించి భద్రతా చర్యలకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రొటెక్షన్ మెష్ ఏర్పాటు చేస్తే వంతెనపై నుంచి దూకే ప్రయత్నాలను అడ్డుకోవడంతో పాటు, ప్రమాదవశాత్తూ కిందకు పడిపోయే ఘటనలను కూడా కొంతవరకు నివారించే అవకాశం ఉంది. వంతెనపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులకు భద్రత పెరగడంతో పాటు ప్రజల్లో భరోసా కలిగే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి, వంతెనపై పూర్తిస్థాయి భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

# రామన్నపాలెం శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



మొగల్తూరు సెప్టెంబర్ 8
జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయం నందు మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు వాడపల్లి భాస్కరమూర్తి వారి కుమారుడు వాడపల్లి పవన్ కుమార్ స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ ఏర్పాటు చేశారు.

# ఒంటిమిట్ట ఎంపీపీ అభ్యర్థిగా గజ్జల నరసింహారెడ్డి..?

**- టీడీపీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం**

**- నాలుగు దశాబ్దాలుగా పార్టీకి అంకితమైన నాయకుడిగా గుర్తింపు**

**- కార్యకర్తలకు అండగా నిలిచిన నేతగా మండలంలో ప్రత్యేక గుర్తింపు**

**- కూటమి నేతలు, కార్యకర్తల మద్దతు కూడా కలిసొచ్చే అవకాశం**

**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, సెప్టెంబర్ 7:**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఒంటిమిట్ట మండలంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.

ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీ తరపున మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) అభ్యర్థిగా గజ్జల నరసింహారెడ్డి పేరును పార్టీ అధిష్ఠానం పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే పార్టీ అధికారికంగా అభ్యర్థిత్వాన్ని ప్రకటించాల్సి ఉంది.

గజ్జల నరసింహారెడ్డి గత నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీల కార్యకర్తగా కొనసాగుతున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గత పదేళ్లుగా టీడీపీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేయడంతో పాటు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు కూడా అండగా నిలిచిన నాయకుడిగా ఆయనకు



గుర్తింపు ఉందని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

కార్యకర్తలకు భరోసా

2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ పాలనలో కూడా టీడీపీ కార్యకర్తలకు అండగా నిలిచి, వారికి భరోసా కల్పించడంలో నరసింహారెడ్డి కీలక పాత్ర పోషించారని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 'నేనున్నాను' అంటూ కార్యకర్తలకు ధైర్యం చెప్పడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో ఆర్థికంగా కూడా సహాయం చేసినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

ఈ కారణాలతోనే మండలంలోని టీడీపీ కార్యకర్తల్లో గజ్జల నరసింహారెడ్డి పట్ల సానుకూలత ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీ కార్యకర్తలతో సుదీర్ఘ అనుబంధం, వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సంబంధాలు ఆయనకు అదనపు బలంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

కూటమి శ్రేణుల మద్దతుపై చర్చ

గజ్జలనరసింహారెడ్డి ఎంపీపీ అభ్యర్థిగా బరిలోకి దిగితే ఆయనకు టీడీపీతో పాటు కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తల మద్దతు కూడా లభించే అవకాశం ఉందనే చర్చ మండలంలో సాగుతోంది. అంగబలం, ఆర్థిక బలం, స్నేహబలం, పార్టీ కార్యకర్తల మద్దతు వంటి అంశాలు ఆయనకు అనుకూలంగా మారవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

అదేవిధంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సబిత, రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జగన్మోహన్ రాజు తదితరుల మద్దతు ఆయనకు ఉందనే ప్రచారం కూడా పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ పరిణామాలు నరసింహారెడ్డి అభ్యర్థిత్వానికి మరింత బలం చేకూర్చే అవకాశముందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.

ఎంపీపీ అభ్యర్థిత్వంపై ఆసక్తి

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఒంటిమిట్ట మండలంలో ఎంపీపీ పదవికి ఎవరు అభ్యర్థిగా నిలుస్తారనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో గజ్జల నరసింహారెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తుండటంతో ఆయన అనుచరులు, టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది.

అయితే ఎంపీపీ అభ్యర్థిత్వంపై తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పార్టీ నిర్ణయం అనంతరం ఒంటిమిట్ట మండలంలో ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## ఎగువశోభ పంచాయతీ రైతులకు రాజ్మా విత్తనాల పంపిణీ

## రైతులకు రాజ్మా సాగుపై అవగాహన కల్పించిన జనసేన అధ్యక్షులు చిట్టం మురళి

**అనంతగిరి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 8**
అనంతగిరి మండలం ఎగువశోభ పంచాయతీ పరిధిలోని రైతులకు రాజ్మా విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రైతులను ప్రోత్సహిస్తూ వ్యవసాయ రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షులు చిట్టం మురళి సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అరుణ్ కుమార్ రైతులకు రాజ్మా విత్తనాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా చిట్టం మురళి మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను కూడా సాగు చేయడం ద్వారా మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందుతున్న విత్తనాలు, సాంకేతిక సలహాలు, వ్యవసాయ సంబంధిత పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన సమయంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి సాగులో తగిన సూచనలు,



సలహాలు అందించాలని ఆయన అన్నారు.

రాజ్మా పంటకు సంబంధించి విత్తనాల ఎంపిక, విత్తే విధానం, పంట సంరక్షణ, ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణ వంటి అంశాలపై రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలను పాటించాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ అరుణ్ కుమార్ తెలిపారు. పంట సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయాన్నిమరింతలాభసాటిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని జనసేన నాయకులు పేర్కొన్నారు. రైతుల సమస్యలను తెలుసుకుని, వారికి అవసరమైన సహకారం అందించేందుకు జనసేన పార్టీ తరఫున కూడా ఎల్లప్పుడూ ముందుంటామని చిట్టం మురళి తెలిపారు. రైతులకు విత్తనాలు పంపిణీ చేయడం ద్వారా సాగు ప్రారంభ దశలో వారికి కొంత తోడ్పాటు అందుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు.

అలాగే ఎగువశోభ పంచాయతీలో రైతులకు ఎదురవుతున్న వ్యవసాయ సమస్యలు, సాగునీరు, పంటలకు మార్కెట్, రవాణా తదితర అంశాలపై కూడా చర్చించారు. రైతులు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి అవసరమైన స్థాయిలో సహకారం అందించేందుకు ప్రయత్నిస్తామని జనసేన నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నాయకులు మధు, పంచాయతీ నాయకులు రామారావు, బొంజోబాబు, సన్యాసి రావు, గుమ్మడి రాము, ఏపీఎండీసీ ఉద్యోగి సుబ్బారావు, పొట్టంగి సన్యాసి రావుతో పాటు రైతులు మంగ్ల, హరి తదితరులు పాల్గొన్నారు. రైతులు రాజ్మా విత్తనాలు అందించిన వ్యవసాయ శాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## బొర్రాలో ఘనంగా మెగా మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరం

## రక్తదాతలకు సర్టిఫికెట్లు, గిఫ్టులు, ఎనర్జీ డ్రింక్స్ అందించిన జనసేన మండల అధ్యక్షులు చిట్టం మురళి

**అనంతగిరి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 08**
అనంతగిరి మండలం బొర్రా పంచాయతీ పరిధిలో మాతృభూమి సేవ సంఘం, బొర్రా ట్రైబల్ టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, యువత, టాక్సీ డ్రైవర్లు, సేవా కార్యక్రమాలపై ఆసక్తి ఉన్న పలువురు ఉత్సాహంగా హాజరై తమ వంతు సహకారం అందించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి ఉపయోగపడేలా రక్తదానం చేయడం గొప్ప మానవతా సేవ అని నిర్వాహకులు పేర్కొన్నారు.

రక్తదానం చేసిన దాతలను ప్రోత్సహిస్తూ జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షులు చిట్టం మురళి ప్రత్యేకంగా అభినందించారు.

రక్తదాతలకు సర్టిఫికెట్లు, గిఫ్టులు, ఎనర్జీ డ్రింక్స్ అందజేసి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా చిట్టం మురళి మాట్లాడుతూ.. "రక్తదానం ఒకరి ప్రాణాన్ని కాపాడే మహత్తరమైన సేవ. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి. యువతలో సేవాభావాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉంది" అని అన్నారు.

పుష్పగిరి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

మెగా మెడికల్ క్యాంప్‌లో భాగంగా పుష్పగిరి ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు కంటి



చూపు, ఇతర కంటి సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేసి అవసరమైన సూచనలు అందించారు. కంటి పరీక్షల్లో అద్దాలు అవసరమైన వారికి పది రోజుల్లో కంటి అద్దాలను అందజేస్తామని పుష్పగిరి ఐ హాస్పిటల్ సిబ్బంది తెలిపారు. దీంతో కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న పలువురు స్థానికులు ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంత ప్రజలకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి కంటి అద్దాలు అందించడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు.

మెగా మెడికల్ క్యాంప్‌లో ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. సాధారణ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని వైద్య సిబ్బంది సూచించారు.

సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మాతృభూమి సేవ సంఘం, బొర్రా ట్రైబల్ టాక్సీ యూనియన్ సభ్యులను చిట్టం మురళి అభినందించారు. వైద్య శిబిరాలు, కంటి పరీక్షలు, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు గ్రామీణ, గిరిజన ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాతృభూమి సేవ సంఘం వ్యవస్థాపకులు గోపి, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు కరక నాగేష్,బొర్రా టాక్సీవాలా ప్రెసిడెంట్ ప్రేమ్ కుమార్ టీడీపీ నాయకులు ఉదయ్ బొర్రా యూనియన్ టాక్సీ డ్రైవర్లు, సంఘం సభ్యులు, యువత, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. రక్తదాతలను సత్కరించడం ద్వారా మరింత మంది యువత రక్తదానానికి ముందుకు రావాలనే ఉద్దేశంతో సర్టిఫికెట్లు, గిఫ్టులు, ఎనర్జీ డ్రింక్స్ అందించినట్లు తెలిపారు.

"రక్తదానం ప్రాణదానం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ మెగా మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరం బొర్రా పంచాయతీలో సేవాభావానికి ప్రతీకగా నిలిచిందని స్థానికులు అభినందించారు.

## ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి - ఎస్సై టి. సుధీర్




గణేష్ ఉత్సవాలపై మార్గదర్శకాలు వివరిస్తున్న ద్వారకాతిరుమల ఎస్సై టి. సుధీర్

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా సెప్టెంబర్ 8 ద్వారకాతిరుమల**
ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై టి. సుధీర్ బాబు పిలుపునిచ్చారు.గణేష్ విగ్రహ ప్రతిష్ట మరియు మండపాల ఏర్పాటు కోసం నిర్వాహకులు తప్పనిసరిగా http://ganeshutsav.net వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ముందస్తు అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. మండపాల ఏర్పాటు వల్ల ప్రజలకు, వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ అంతరాయం కలగకూడదని సూచించారు.

పోలీసులు జారీ చేసిన ప్రధాన మార్గదర్శకాలు:

లౌడ్ స్పీకర్లను నిబంధనలకు లోబడి నిర్ణీత సమయాల్లో మాత్రమే అనుమతించిన శబ్ద పరిమితుల్లో వినియోగించాలి.ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే రెచ్చగొట్టే ప్రసంగాలు, పాటలు నిషేధం.మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడం, గొడవలకు దిగడం చట్టరీత్యా నేరం, నిమజ్జన సమయంలో పోలీసులు నిర్దేశించిన మార్గాలు, సమయాలను పాటించాలి.మండపాల వద్ద విద్యుత్, అగ్నిప్రమాదాలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలి.సోషల్ మీడియాలో పుకార్లు, మత విద్వేష పోస్టులు షేర్ చేస్తే కఠిన చర్యలు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఉత్సవాలు భక్తి, ఐక్యతకుప్రతీకగా నిలిచేలా పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఉచితాలు వద్దు .. అభివృద్ధి కావాలి: రొట్టం భూపతి ముదిరాజ్




**జనసముద్రంన్యూస్, ఆగష్టు 8 :**
హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ముదిరాజ్ లను బీసీ–డి నుండి బీసీ–ఏ లోకి మార్చాలని మంగళవారం జరిపిన సమావేశంలో ఆల్ ఇండియా కోలి సమాజ్ (ముదిరాజ్) వర్కింగ్ ప్రెసిడెంట్ రొట్టం భూపతి ముదిరాజ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులకు ప్రభుత్వం ఉచిత తాయిలాలు ఇస్తూ మభ్య పెటేందుకు ప్రయత్నిస్తుందని, దానికి ముదిరాజ్ కులస్తులు లొంగరని భూపతి ముదిరాజ్ పేర్కొన్నారు. తక్షణమే ముదిరాజ్ లను బీసీ–డి నుండి బిసి ఏ లోకి మార్చి కామారెడ్డి లో కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా తెలిపినారు, లేని పక్షంలో లో బీఆర్ఎస్ కు పట్టిన గతే పడుతుందని , ముదిరాజ్ లందరు ఏకమై ప్రభుత్వాన్ని దింపడానికి కంకణం కట్టుకున్నారు అని తెలిపారు. మా జాతికి కావల్సింది మంచి బడులు, విద్యా , ఉద్యోగాలు కావాలి కానీ తాయిలాలు వద్దు అని తెలిపారు. పేద విద్యార్థులకు హాస్టల్స్ నిర్మించి విద్యను అందిచినపుడే జాతి నిర్మాణం జరుగుతుందని ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు, ఇదే కాంగ్రెస్ పార్టీ 2004 ఎలక్షన్ టైం లో తమ మ్యానిఫెస్టోలో ముదిరాజ్ లను బీసీ 'డి' నుండి బిసి 'ఏ' లోకి మార్చుతామని తెలిపారు. హామీ ప్రకారం మార్చినప్పటికి అది వివిధ కారణాల వల్ల ఇప్పటికీ అమలు కాలేదని, దానిని ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో అమలు చేయాలని ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ముదిరాజ్ జాతి కి న్యాయం చేయాలని , అప్పుడే తెలంగాణా ముదిరాజ్ జాతి ఈ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటుందని , లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో గద్దె దింపడానికి సిద్దంగా ఉంటుందని భూపతి ముదిరాజ్ తెలిపినారు, ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర నలుమూలల నుండి ముదిరాజ్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ ఎస్ మూవీ క్రియేషన్స్ వారి ఆధ్వర్యంలో లాస్ట్ బెంచ్ డైరీ మూవీ షూటింగ్





**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 8**
లక్కిరెడ్డిపల్లి మండలం గ్రామీణ ప్రాంతం లో అద్భుతంగా సినీ సన్నివేశాలు టీచర్స్ డే సందర్భంగా ఈ సినిమా ఉపాధ్యాయులకు అంకితం అందుకనగా సెప్టెంబర్ ఐదు ను పూజా కార్యక్రమాలను దిగ్విజయంగా మొదలు పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల్లో పొట్టి మామ కామెడీ సన్నివేశాలు, ఇంకా విలన్ పాత్రలో మారుతి సకాలం గారితో ఉద్రేఖాత్మకమైన టువంటి సన్నివేశాలు పూర్తిచేసుకుని శరవేగంతో దూసుకుపోతున్న లాస్ట్ బెంచ్ డైరీ మూవీ ప్రొడ్యూసర్ రూప శ్రీ , డైరెక్టర్ స్క్రీన్ ప్లే స్టోరీ చంద్రమౌళి ఈ సినిమాను అద్భుతంగా తీయాలని ఎటువంటి రాజీ పడకుండా తల్లిదండ్రులు గురువుల యొక్క విలువలను తెలియజేయాలని, అలాగే హీరో కొలిమి పక్కీరయ్య అలియాస్ శివరామశాస్త్రి మాట్లాడుతూ విద్యా అనేది ఒక ఆయుధం లాంటిది అది పొందడం అది ఒక వరమని హీరో వ్యాఖ్యానించారు. అలాగే శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజా కార్యక్రమాలు అద్భుతంగా జరిగాయి ఇందులో గ్రామ ప్రజలు రాజకీయ వేత్తలు పాత్రికేయులు అతిరథ మహారథులు, అలాగే కెమెరామెన్ గణేష్, మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ చెన్నూరు అద్భుతమైనటువంటి సంగీతాన్ని అందించారు. అందరూ విచ్చేసి లక్కిరెడ్డిపల్లి చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో తెరకెక్కిస్తున్నట్లు తల్లిదండ్రులు మరియు గురువుల యొక్క విలువలను గురించి విద్యార్థులు అదే మెయిన్ పాయింట్ ఎలా మార్పు రావాలో ఈ చిత్రం కుటుంబ కథ అన్ని విధాల అలరిస్తుందని అలాగే ఈ గ్రామీణ చుట్టుపక్కల వారు అందరి సహాయ సహకారాలతో మొదటి షెడ్యూల్ ని విజయవంతంగా ఈ సినిమాని నిర్మించబోతున్నామని డైరెక్టర్ తెలిపారు.

## ఏపీయూఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు







**తూర్పుగోదావరి/ సీతానగరం/ సెప్టెంబర్ 08/జనసముద్రం న్యూస్ :**
స్థానిక మండలంలోని వెదుళ్ళపల్లి జెడ్పీహైస్కూల్ ప్లస్ నందు మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు గ్రహించిన పలువురు ఉపాధ్యాయులతో పాటు విశిష్ట సన్మాన గ్రహీత, మండల విద్యాశాఖాధికారి కె.స్వామి నాయక్ ను సంఘ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. జె.ఎస్ శ్రీనివాసరావు జడ్పీహెచ్ఎస్ మిర్తిపాడు, జి. అరుణ కుమారి ఎంపీపీఎస్ చిన వంగలపూడి, జి. సుజాత ఎంపీపీఎస్ ముగ్గుళ్ళ, జి. శేఖర్ జడ్పీహెచ్ఎస్ రఘుదేవపురం,కె.అర్జునరావు జడ్పీహెచ్ఎస్ కూనవరం, ఎ.డి. ప్రసాద్ జడ్పీహెచ్ఎస్ పెద వంగలపూడి, బి. సత్యనారాయణ జడ్పీహెచ్ఎస్ ప్రభాకర్ నగర్, పి. శ్రీనివాసరావు ఎంపీపీఎస్ జె.జె. నగర్ లు సన్మానాలను పొందారు. ఈ కార్యక్రమాన్ని ఏపీయూఎస్ మండల అధ్యక్షుడు కె. ఫణి బాబు, ప్రధాన కార్యదర్శి కె ఎన్ బి లక్ష్మి, సభ్యులు డి. సుధాకర్, ఎ. రాజేష్, రమాదుర్గ, మోహన్ రావు, ఎ. ప్రసాద్ తదితరులు నిర్వహించగా, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL / 2021 / 16151 for Queries Contact us @ 94941 84136,
janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb / janasamudram